
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



సానుకూల నివేదిక ఇవ్వండి

- సీఎస్‌ను కోరిన ప్రభుత్వ విప్ కాలవ



సీఎస్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాలవ

అనంతపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై కేంద్రానికి సానుకూల నివేదికను పంపాలని సీఎస్ విజయానంద్‌ను ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు శుక్రవారం విజయవాడలో సీఎస్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కాలవ శ్రీనివాసులు కలిశారు. దశాబ్దాలుగా వాల్మీకి, బోయలు ఎస్టీ సాధన కోసం అనేక పోరాటాలు చేస్తున్నారన్నారు. న్యాయమైన బోయల కోర్కెను తీర్చడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్తశుద్ధితో ప్రయత్నించారన్నారు. అందులో భాగంగా 2017 డిసెంబరులో రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేయించి కేంద్రానికి పంపారని గుర్తు చేశారు. తరువాత కేంద్రం కొన్ని వివరాలను కోరగా... వాటికి సమాధానమివ్వాల్సిన జగన్ ప్రభుత్వం ప్రాంతీయ విభేదాలను సృష్టించి, రాయలసీమ జిల్లాల వాల్మీకి బోయలను మాత్రమే ఎస్టీలుగా గుర్తిస్తే సరిపోతుందని నివేదికను కేంద్రానికి పంపి సమస్యను మరింత జటిలం చేసిందన్నారు. ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం 2017 డిసెంబరులో చంద్రబాబు సర్కారు చేసిన తీర్మానానికి కట్టుబడి ఉందన్న విషయాన్ని కేంద్రానికి వివరించాలని విజ్ఞప్తి చేశారు. సాధ్యమైనంత త్వరగా సమాధానం పంపడంతో పాటు ఆ విషయాన్ని జాతీయ ఎస్టీ కమిషన్‌కు నివేదించాలని సీఎస్‌కు విజ్ఞప్తి చేశారు.

చివరి రోజు 698

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిట
- రామ్ నగర్‌లో అత్యధికంగా 182 రిజిస్ట్రేషన్లు
- నేటి నుంచి పెరగనున్న భూముల ధరలు

అనంతపురం క్రైం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): భూముల రిజిస్ట్రేషన్ విలువ శనివారం నుంచి పెరుగుతుండటంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు శుక్రవారం కిటకిటలాడాయి. సాధారణ రోజులతో పోలిస్తే.. మూడు రెట్లకు పైగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. సాధారణ రోజుల్లో జిల్లా పరిధిలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో 180 నుంచి 200 వరకు రిజిస్ట్రేషన్లు జరిగేవి. కానీ శుక్రవారం ఏకంగా 698 రిజిస్ట్రేషన్లు జరిగాయి. అత్యధికంగా అనంతపురం రామ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 182 డాక్యుమెంట్లు జరిగాయి. రిజిస్ట్రేషన్ ప్రక్రియను శుక్రవారం ఉదయం 7.30 గంటలకే ప్రారంభించామని సబ్ రిజిస్ట్రార్లు తెలిపారు. తొలి రెండున్నర గంటల్లోనే 60కిపైగా డాక్యుమెంట్లు పూర్తయ్యాయని జాయింట్ సబ్ రిజిస్ట్రార్-2 యూనస్ తెలిపారు. అనంతపురం రూరల్ కార్యాలయంలో ఒకే రోజు 112 రిజిస్ట్రేషన్లు అయ్యాయి.

కార్యాలయాల్లో రద్దీ

అనంతపురం రామ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజూ సగటున 60 రిజిస్ట్రేషన్లల జరిగేవి. కానీ శుక్రవారం 182 రిజిస్ట్రేషన్లు జరిగాయి. అనంతపురం రూరల్ కార్యాలయంలో తరచూ గరిష్ఠంగా 50 రిజిస్ట్రేషన్లు జరిగేవి. కానీ శుక్రవారం ఏకంగా 112 జరిగాయి. తాడిపత్రి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజుకు సగటున 40 రిజిస్ట్రేషన్లు అయ్యేవి. శుక్రవారం 87 రిజిస్ట్రేషన్లు జరిగాయి. గుంతకల్లు, గుత్తి, రాయదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో రోజూ 15 వరకూ రిజిస్ట్రేషన్లు అయ్యేవి. గుంతకల్లులో ఒకే రోజు 58, గుత్తిలో 67, రాయదుర్గంలో 35 రిజిస్ట్రేషన్లు జరిగాయి. కళ్యాణదుర్గం, ఉరవకొండ, పామిడి, యాడికి, శింగనమల, కణేకల్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 8 నుంచి 10 డాక్యుమెంట్లు జరిగేవి. భూముల ధరల నేపథ్యంలో కళ్యాణదుర్గంలో 35, ఉరవకొండలో 36, పామిడిలో 30, యాడికిలో 26, కణేకల్లులో 15, శింగనమలలో 15 రిజిస్ట్రేషన్లు జరిగాయి. సర్వర్ మొరాయించడంతో జిల్లా వ్యాప్తంగా మరో 30 నుంచి 35 రిజిస్ట్రేషన్లు ఆగినట్లు తెలిసింది.

ఉదయమే ప్రారంభించాం..

భూముల ధరలు పెరగనున్న నేపథ్యంలో ఈ రోజు ఎక్కువ డాక్యుమెంట్లు జరుగుతాయనని అనుకున్నాం. రోజూ 50 నుంచి 60 రిజిస్ట్రేషన్లు జరిగేవి. గురువారం 145 వరకు జరిగాయి. శుక్రవారం ఉదయం 7.30 గంటలకే రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టాం. ఈ ఒక్క రోజే 182 డాక్యుమెంట్లు పూర్తి చేశాం. సర్వర్ సమస్యతో మరో నాలుగైదు పెండింగ్‌లో ఉండిపోయాయి.

-యూనస్, జాయింట్ సబ్ రిజిస్ట్రార్-2, అనంతపురం



అనంతపురం రామ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రద్దీ

నేటి నుంచి కొత్త విలువ 4లో..



- నిరాశాజనకంగా ఎంఎస్ఎంఈ సర్వే
- 37.26 శాతం యూనిట్లు మాత్రమే నమోదు
- సిబ్బంది నిర్లక్ష్యం.. వ్యాపారుల్లో అపోహలే కారణం
- నవంబరులో మొదలై.. జనవరితో ముగిసిన గడువు

అపోహలు.. అలక్ష్యం..!

ఇవీ ప్రయోజనాలు..

సర్వేద్వారా ఉద్యమ్ రిజిస్ట్రేషన్ లేనివారికి నంబరు కేటాయిస్తారు. యాప్‌లో అప్‌లోడ్ అయిన ఎంఎస్ఎంఈలకు స్టాండప్ ఇండియా, ఇతర పారిశ్రామిక పథకాల ద్వారా ఆర్థిక సాయం అందిస్తారు. మార్కెటింగ్ సాయం అందించేందుకు, ఆలస్యమైన ఆర్థిక చెల్లింపుల సమస్యలను పరిష్కరిస్తారు. అవసరమైన సంస్థలకు జడ్ఈడీ, ఐఎస్ఓ, 9000, ఐఎస్ఐ తదితర నాణ్యత ధ్రువపత్రాలు పొందడంలో సాయం అందిస్తారు. అర్హత కలిగిన యూనిట్లకు పారిశ్రామిక వాడలు, ఎంఎస్ఎంఈ పార్కులు, ప్లాటెడ్ కాంప్లెక్స్‌ల్లో ప్లాట్లు కేటాయిస్తారు. ఆర్థిక వ్యవస్థను అర్థం చేసుకుని, ప్రభుత్వ పథకాలను రూపకల్పనకు ఈ సర్వే ఉపయోగపడుతుంది. కానీ దీనిపై తగిన అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వస్తున్నాయి.



ఉడేగోళంలో సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది (ఫైల్)

అనంతపురం అర్బన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమల సర్వే జిల్లాలో ఆశించిన స్థాయిలో జరగలేదు. పారిశ్రామికవేత్తలు, వ్యాపారుల వివరాలు నమోదు చేయడం ద్వారా ప్రభుత్వ పథకాల లబ్ధిపొందేందుకు అవకాశం ఉంది. అన్ని రకాల ఎంఎస్ఎంఈ పారిశ్రామికవేత్తలు, వ్యాపారులకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ నంబరు తప్పనిసరిగా ఉండాలని ప్రభుత్వం నిబంధన విధించింది. గత ఏడాది నవంబరు చివరి వారంలో సర్వే ప్రారంభించారు. ఈ ఏడాది జనవరిలోగా పూర్తి చేయాల్సి ఉంది. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి నమోదు బాధ్యతలు అప్పగించారు. జిల్లా యంత్రాంగం అధికారులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించింది. గడువులోగా సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. గడువు శుక్రవారంతో ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 37.26 శాతం యూనిట్ల సర్వేతో సరిపెట్టారు. అధికారుల పర్యవేక్షణా లోపమే దీనికి ప్రధాన కారణం. సర్వే గడువు పొడిగించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

33, 349 యూనిట్ల సర్వే

జిల్లా వ్యాప్తంగా 89,503 ఎంఎస్ఎంఈ యూనిట్ల సర్వే చేయాల్సి ఉండగా.. 33,349 యూనిట్లను (37.26 శాతం) మాత్రమే సర్వే చేశారు. ఇందులో 24,764 యూనిట్లు వర్కింగ్‌లో ఉన్నట్లు, 8,585 యూనిట్లు పనిచేయడం లేదని తేల్చారు. సిబ్బంది నిర్లక్ష్యం, వ్యాపారులు సహకరించకపోవడంతో సర్వే సజావుగా సాగలేదు. ఆధార్, పాన్, జీఎస్టీ, టర్నోవర్ ఇతర వివరాలు అడుగుతుండటంతో వ్యాపారులు భయంతో సహకరించలేదని సమాచారం. సర్వే ప్రయోజనాలను వారికి తెలియజేయకపోవడంతో సమస్య తలెత్తింది.

ఎక్కడెక్కడ.. ఎన్నెన్ని..?

అనంతపురం కార్పొరేషన్ పరిధిలో 31,006 యూనిట్లకుగానూ 4218 యూనిట్ల(13.60 శాతం) సర్వే చేశారు. గుంతకల్లు మున్సిపాలిటీ పరిధిలో 7,660 యూనిట్లకుగానూ 2101 యూనిట్లు (27.43 శాతం)చేశారు. గుత్తి మున్సిపాలిటీ పరిధిలో 2,666 యూనిట్లకుగాను 819 (30.72 శాతం) యూనిట్ల సర్వే చేశారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలో 3,123 యూనిట్లకుగాను 962 (30.80 శాతం) యూనిట్లు రాయదుర్గం మున్సిపాలిటీలో 4,043 యూనిట్లకుగాను 2333 (57.70 శాతం), తాడిపత్రి మున్సిపాలిటీలో 6,912 యూనిట్లకుగాను 5,079 (73.48 శాతం) యూనిట్లను సర్వే చేశారు. అత్యధికగా పెద్దవడుగూరు మండలంలో వందశాతం (978 యూనిట్లు) పూర్తి చేశారు. కుందుర్పి మండలంలో 804 యూనిట్లకుగాను 792(98జ51 శాతం) పూర్తి చేశారు. పామిడి, పెద్దపప్పూరు, విడనపనకల్లు, రాయదుర్గం, వజ్రకరూరు, ఆత్మకూరు, గుమ్మగట్ట, బ్రహ్మసముద్రం, యల్లనూరు, నార్పల, కళ్యాణదుర్గం, పుట్లూరు, గార్లదిన్నె, అనంతపురం రూరల్ మండలాల్లో 50.40 శాతం నుంచి 94.47 శాతం వరకు పూర్తి చేశారు. మిగిలిన మండలాల్లో 26.29 శాతం నుంచి 47.11 శాతంలోపు సర్వే పూర్తి చేశారు.

ఆశించిన స్థాయిలో జరగలేదు..



మున్సిపాటిలిటీలు, మండలాల్లో అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. నిరంతరం పర్యవేక్షించినా కొన్నిచోట్ల సర్వే ఆశించిన స్థాయిలో సాగలేదు. ఎంఎస్ఎంఈ సర్వేను తప్పని సరిగా పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నాయి. గడువు ముగిసింది. పొడిగింపు ఆదేశాలు రాలేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందుకు వెళతాం.

- శ్రీధర్, పరిశ్రమల శాఖ జిల్లా అధికారి

చుక్కల సమస్య పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిషేధిత జాబితాలో ఉన్న చుక్కల భూముల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టరు వినోద్‌కుమార్ పేర్కొన్నారు. సంబంధిత అధికారులతో శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ చుక్కల భూములు, గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకోసం ప్రతి వారం డాటెడ్ ల్యాండ్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించి, సమస్యలను చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో బుక్కరాయసముద్రం, కూడేరు, నార్పల మండలాలకు చెందిన ఐదు కేసులను విచారించినట్లు తెలిపారు. అందులో రెండు కేసులును ఆమోదించగా, మరో రెండు కేసులను తిరస్కరించినట్లు వెల్లడించారు. ఇంకో కేసును పున:పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ శివనారాయణశర్మ, డీఆర్ఓ మలోల, ఆర్డీఓ కేశవ నాయుడు, కలెక్టరేట్ సెక్షన్ ఆఫీసర్ రియాజుద్దీన్, కూడేరు, బీకేఎస్, నార్పల మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.




ఆత్మార్పణ వైభవం

వాసవీమాతకు విశేష పూజలు

వాసవీ మాత ఆత్మార్పణ దినాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆర్య వైశ్య మహిళలు అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. వేద పండితులు హోమాలు చేశారు. అమ్మవారు భూమిని విడిచి వెళ్లే సమయంలో తాను ఆదిపరాశక్తి అవతారమని, స్త్రీల గౌరవాన్ని, ధర్మాన్ని కాపాడేందుకు వాసవీమాతగా అవతరించానని చెప్పినట్లు పురాణాలు పేర్కొంటున్నాయి. త్యాగం, శాంతి, కలిసి జీవించడం వంటి సందేశాలను అమ్మవారు మానవాళికి ఇచ్చారని వేద పండితులు వివరించారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం కల్చరల్



పాతూరులో ఉత్సవమూర్తికి ప్రత్యేక అలంకరణ





పాతూరులో వజ్రకవచ చీరలో దర్శనమిస్తున్న వాసవీమాత, సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న ఆర్యవైశ్య మహిళలు



కొత్తూరులో స్వర్ణకవచ చీరలో వాసవీమాత, సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న ఆర్యవైశ్య మహిళలు



రేపటి ఉదయమై వస్తా..!



తూరుపు దిక్కున
ఉదయించినది మొదలు
విసుగు చెందక, విరామమెరుగక
జగతికి వెచ్చని వెలుగులు
పంచిన భానుడు..
రణ క్షేత్రంలో భీకరంగా పోరాడి,
రుధిర ధారలు పులుముకున్న వీరుడిలా
అరుణవర్ణంతో శోభిల్లుతూ...అలసి, సొలసి
ప్రకృతి అద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకుంటూ
విశ్రాంతి కోసం పడమటి దిక్కుకు పయణించే వేళ
గంగమ్మ ఎర్రనీళ్లతో దిష్టి తీస్తోంది.

చిత్రమైన సృష్టిలో ప్రకృతి గీసిన ఈ చిత్రాలను అనంతపురం నగర శివారు పండమేరు వద్ద శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది.



నిధులు ఇస్తాం.. ప్రణాళిక సిద్ధం చేయండి

● ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీ

అనంతపురం టౌన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజన ఆస్పత్రికి ప్రత్యేకంగా నిధులు ఇస్తున్నామని, వాటితో ఆస్పత్రిలో పనులు చేయడానికి తగిన ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఇంజనీర్లకు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సూచించారు. పెన్నార్‌భవన్‌లో ఉన్న జిల్లాప్రణాళిక కార్యాలయంలో ఎంపీ ల్యాండ్స్‌తో పనులు-నిధుల ఖర్చు తదితర వాటిపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జిల్లాలో ఎంపీ ల్యాండ్స్, ఉపాధి నిధులను ప్రజలకు ఉపయోగపడే పనులకే ఉపయోగించాలన్నారు. అలాంటి పనులు ఏమైనా ఉంటే గుర్తించి తన దృష్టికి తీసుకువస్తే వాటికి నిధులు వచ్చేటట్లు చేస్తానన్నారు. మంజూరైన నిధులతో ఆపనులను సకాలంలో పూర్తిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని ఇంజనీర్లకు సూచించారు. సీపీఓ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. పనులు పూర్తికాగానే బిల్లులను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేసి పంపాలని ఇంజనీర్లను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, డ్వామా, డీఆర్‌డీఏ, మునిసిపల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైన్ షాపుల కోసం దరఖాస్తు చేసుకోండి

● అనంతపురం ఈఎస్

అనంతపురం అర్బన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కల్లు గీత కార్మికులు మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఈఎస్) రామమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలోని తన చాంబర్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈనెల 27 నుంచి ఫిబ్రవరి ఐదో తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఫిబ్రవరి 7న కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో కలెక్టర్ సమక్షంలో లాటరీ తీస్తామన్నారు. జిల్లాలో 14 మద్యం షాపులను కల్లుగీత కార్మికులైన ఈడిగ, గౌడ్, గౌడ, గౌండ్ల, కళాలి కులస్థులకు కేటాయించినట్లు తెలిపారు. ఈడిగకు 9, గౌడ్‌కు 2, గౌడ, గౌండ్ల, కళాలి కులస్థులకు ఒక్కొక్కటి చొప్పున దుకాణాలు కేటాయించామన్నారు. ఈడిగ కులస్థులు గుంతకల్లు, రాయదుర్గం, గుత్తి, కళ్యాణదుర్గం మున్సిపాలిటీలు, కంబదూరు, గుమ్మఘట్ట, గుంతకల్లు రూరల్, రాప్తాడు, బెళుగుప్ప మండలాల్లో దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గౌడ్ కులస్థులు అనంతపురం నగర పాలక సంస్థ, గుత్తి రూరల్ మండలంలోని దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గౌడ రాయదుర్గం రూరల్, గౌండ్ల కులస్థులు డి.హీరేహాళ్, కళాలి కులస్థులు తాడిపత్రి మున్సిపాలిటీలోని దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలోని 10 ఎక్సైజ్ పోలీసు స్టేషన్లల్లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. జిల్లాకు చెందిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. దరఖాస్తుదారులు రూ.2 లక్షలు నాన్‌రిఫండబుల్ దరఖాస్తు ఫీజు చెల్లించాలన్నారు. కల్లుగీత కార్మికులకు మద్యం షాపుల లైసెన్స్ ఫీజులో 50 శాతం రాయితీని ప్రభుత్వం కల్పించినట్లు వివరించారు.

రేపు జీవజంత్ కళ్యాణ్ దివస్

అనంతపురం అర్బన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): అనిమల్ వెల్ఫేర్ బోర్డు ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఆదివారం జీవజంత్ కళ్యాణ్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి ప్రకటనలో పేర్కొన్నారు. ఏటా ప్రాంతీయ పశు వైద్యశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి కొత్త విలువ

జిల్లాలో భూముల మార్కెట్ విలువ పెంపు

10 నుంచి 20 శాతం వరకూ..

గతేడాది పెంచని ప్రభుత్వం

రిజిస్ట్రేషన్ల శాఖకు ఆదాయంపై ఆశలు



అనంతపురం రూరల్ సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద రిజిస్ట్రేషన్ల కోసం వేచివున్న క్రయ, విక్రయదారులు

అనంతపురం క్రైం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా భూముల మార్కెట్ విలువ పెంపునకు రంగం సిద్ధమైంది. ఫిబ్రవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా భూముల మార్కెట్ విలువ పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ పరిధిలో ప్రతి ఏటా ఆగస్టు సమయంలో భూముల విలువ పెంచుతూ ఉంటారు. గత ఏడాది కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చాక ఈ అంశంపై కసరత్తు చేసినా పలు కారణాలతో ఈ ప్రక్రియ వాయిదా పడింది. తాజాగా మార్కెట్ ధరలకు అనుగుణంగా భూముల విలువను సవరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో భూముల విలువ 10 నుంచి 20శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. గత ఐదేళ్లలో పోలిస్తే 2019లో ఒకసారి భూముల ధరలు పెరిగాయి. ఆ తరువాత కరోనా కారణంగా మూడేళ్లు భూముల విలువల్లో మార్పు చేయలేదు. కానీ 2023లో భూముల విలువ భారీగా పెరిగింది. గత ఏడాది పెరగలేదు. దీంతో కొనుగోలుదారులపై భారం పడనుంది.

ఎక్కడెక్కడ.. ఎలాగంటే..?

జిల్లా వ్యాప్తంగా భూముల ధరలు 10 నుంచి 20 శాతం వరకు పెరగనున్నాయి. జిల్లా కేంద్రమైన అనంతపురం కార్పొరేషన్‌తో పాటు పలు పట్టణాల్లో అత్యధికంగా 15 నుంచి 20శాతం వరకు పెరిగే అవకాశాలున్నాయని అధికారవర్గాలు చెబుతున్నాయి. అనంతపురం చుట్టుపక్కల భూములు అత్యధిక ధరలు పలుకుతున్నాయి. అనంతపురం అర్బన్ సబ్ రిజిస్ట్రార్ పరిధిలో నారాయణపురంలో గజం ప్రస్తుతం రూ.5వేలు ఉండగా పెరిగిన ధరలతో రూ.6వేలుగా నిర్ణయించారు. కురుగుంట రూ.3600లు ఉండగా రూ.4వేలకు పెంచారు. రాచానపల్లిలో రూ.4వేల నుంచి రూ.5వేలకు, పాములాయిలో రూ.5వేల నుంచి రూ.6వేలకు పెంచారు. అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని కక్కలపల్లి, రుద్రంపేట ప్రాంతంలో గజం రూ.6వేలు ఉండగా రూ.7వేలకు పెంచారు. ఆలమూరు, కట్టకిందపల్లిలో రూ.2500ల నుంచి రూ.2800ల వరకు పెంచారు. మన్నీల, చియ్యేడు, పూలకుంటలో రూ.700లు ఉండగా రూ.900లకు పెంచారు. కొడిమి, నరసనాయనికుంటలో రూ.1100ల నుంచి రూ.1400వరకు పెరగను న్నాయి. మేజర్ పంచాయతీ రాప్తాడుతో పాటు యర్రగుంట్ల, బొమ్మేపర్తి, బండమీదపల్లి ప్రాంతాల్లో గజం రూ.550ల నుంచి రూ.700లకు పెరుగనుంది. మరూరు, గొల్లపల్లి, చెర్లోపల్లి ప్రాంతంలో గజం రూ. 1100ల నుంచి రూ.1400వరకు పెరుగుతా యి. ఆత్మకూరు మండలంలో ఆత్మకూరు, పంపనూరులలో (రెసిడెన్షియల్, కమర్షియల్) ప్రాంతాలకు రూ.2వేల నుంచి రూ.2200 వరకు పెరగనున్నా యి. పి.యాలేరు, మదిగుబ్బ తదితర ప్రాం తాల్లో రూ.550ల నుంచి రూ.700ల వరకు పెరుగుతాయి. కూడేరు మండల కేంద్రంలో గజం రూ. 1100ల నుంచి రూ.1500ల వరకు, గొట్టుకూరులో రూ.2500ల నుంచి రూ.2800లవరకు చోళసముద్రం తదితర ప్రాంతాల్లో రూ.550ల నుంచి రూ.700వరకు పెరుగుతుంది. గార్లదిన్నె మండలం మర్తాడులో రూ.700ల నుంచి రూ.800ల వరకు, పెనకచెర్ల డ్యామ్ లో రూ.550ల నుంచి రూ.700ల వరకు పెరుగుతాయి. బుక్కరాయసముద్రం మండలంలోని గోవిందంపల్లిలో రూ.1800ల నుంచి రూ.2వేల వరకు, పొడరాళ్ల, రేగడికొత్తూరులలో రూ.2వేల నుంచి రూ.2200వరకు పెరుగుతాయి. గుంతకల్లు నియోజకవర్గంలోని కసాపురంలో గజం రూ. 1500 నుంచి 1700వరకు ఉంటుంది. కళ్యాణదుర్గం, రాయదుర్గం పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో గజం రూ.1700ల నుంచి రూ.1900ల వరకు, రూ.2వేల రూ.2100వరకు పెరిగాయి.

పట్టణ ప్రాంతాల్లో

గ్రామీణ ప్రాంతాలతో పోల్చితే పట్టణాల్లో 10 నుంచి 20 శాతం మాత్రమే పెరగను న్నాయి. ఎక్కువగా 15శాతానికే పరిమితం కానున్నాయి. అనంతపురం నగరంలోని వినాయక్‌నగర్‌లో గజం రూ.18వేలుండగా రూ.19వేలకు పెరగనుంది. ఇక కమలానగర్ లాంటి కమర్షియల్ ప్రాంతాల్లో అయితే గజం రూ.40వేలుండగా రూ.42వేలకు పెరగనుంది. గుంతకల్లు పట్టణంలో గజం రూ.3500ల నుంచి రూ.4000వరకు పెరుగుతుంది. కమర్షియల్ ప్రాంతాల్లో మరో రూ.వెయ్యి పెరగనుంది. గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లో 5 నుంచి 18.5శాతం వరకు భూముల ధరలు పెరగనున్నట్లు సంబంధిత రిజిస్ట్రార్లు చెబుతున్నారు. కార్పొరేషన్, మున్సిపాలిటీ పరిధిలో ఆయా ప్రాంతాలకు అనుగుణంగా ధరలు ఉండనున్నాయి. అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్‌లు రూ.1400లు ఉండగా రూ.1490లకు పెరగనుంది. ప్రతి అదనపు ఫ్లోర్‌కు రూ.30ల వరకు పెరుగుతుంది. కమర్షియల్ ప్రాంతాల్లో భవనాలకు సంబంధించి గ్రౌండ్‌ఫ్లోర్‌కు రూ.1800లు, ఫస్ట్ ఫ్లోర్‌కు రూ.1700, సెకండ్ ఫ్లోర్‌కు రూ.1590, సెల్లార్, స్టిల్ట్, పార్కింగ్ ప్లేస్‌కు రూ.1060ల వరకు పెరిగిన ధరలుగా నిర్ణయించారు.

ఆదాయం పెరుగుతుందా...?

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు గత కొంతకాలంగా ఆదాయం తగ్గిందనడంలో ఎలాంటి సందేహం లేదు. 2023లో ఒకే సారి భూముల ధరలు అమాంతం పెరగడంతో రిజిస్ట్రేషన్ చార్జీలు సైతం పెరిగాయి. రియల్ ఎస్టేట్ రంగం పడిపోవడం లాంటి కారణాలతో భూముల రిజిస్ట్రేషన్లు తగ్గాయి. గత ఏడాది భూముల విలువలు పెరగలేదు. ఇప్పుడు కూడా 10నుంచి 15శాతం వరకే అధికంగా పెరగనున్నాయి. గత ఏడాది ఏప్రిల్-డిసెంబర్ మధ్య కాలంలో తగినంత ఆదాయం రాలేదని రికార్డులు చెబుతున్నాయి. దీనికి తోడు అనంతపురం, అనంతపురం రూరల్ వంటి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో గతంలో రోజుకు 80 నుంచి 110వరకు రిజిస్ట్రేషన్లు జరిగేవి. కానీ కొన్ని నెలల పాటు రోజుకు కేవలం 30 నుంచి 40 డాక్యుమెంట్లకే పరిమితమయ్యే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఈ సారి ఆదాయం పెరుగుతుందనే భావిస్తున్నారు.

వ్యవసాయ భూములు ఇలా..

జిల్లాలోని వ్యవసాయ భూములు ఎకరాల వారిగా పెంపుదల కానుంది. ఉదాహరణకు కామారుపల్లి పంచాయతీ పరిధిలో డ్రై/వెట్/గార్డెన్ ఎకరా రూ.1.60లక్షలుండగా రూ.2.50లక్షలకు పెంచారు. అగ్రికల్చర్ ల్యాండ్ ఫిట్ ఫర్ హెచ్ఎస్ కింద రూ.3లక్షలుండగా రూ.6లక్షలకు పెంచారు. ఎన్‌హెచ్, స్టేట్ హైవే రోడ్ల పక్కనున్న వాటికి ఎకరా రూ.2.70లక్షలుండగా రూ.6లక్షలవరకు పెంచారు. హౌస్ సైట్స్ ఉన్న భూములు ఎకరా రూ.26.62లక్షలుండగా రూ.33.88లక్షలుగా పెంచారు. అదే కక్కలపల్లి పంచాయతీ పరిధిలో డ్రై/వెట్/గార్డెన్ కింద ఎకరా రూ.20లక్షలుండగా రూ.22లక్షల వరకు పెంచారు. ఎన్‌హెచ్, స్టేట్ హైవే రోడ్ల పక్కన ఎకరా రూ.82లక్షలుండగా రూ.90లక్షలకు పెంచారు. ఇలా పట్టణ ప్రాంతాలకు సమీపంలోని వ్యవసాయ భూముల కు, గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ భూములకు, హైవేల పక్కన ఉన్న భూములకు ధరల్లో వ్యత్యాసం ఉంటుంది.

ఫీజు పోరును జయప్రదం చేయండి

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత



పోస్టర్లను విడుదల చేస్తున్న వైసీపీ నేతలు

అనంతపురం క్రైం,జనవరి31(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అండగా ఈనెల ఐదున వైసీపీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఫీజు పోరును విజయవంతం చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. వైసీపీ జిల్లా కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఫీజు పోరుకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలవుతున్నా ఒక్క రూపాయి చెల్లించలేదన్నారు. తాజాగా ఫీజులు చెల్లించాలని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయన్నారు. రూ.3900కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఐదో తేదీ ఉదయం 10.30గంటలకు జడ్పీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ శనివారం ఉదయం ఆరు గంటలకే ప్రారంభించనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్, డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య తెలిపారు. గ్రామ-వార్డు సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేస్తారని తెలిపారు. జిల్లాలో 2,82,754 మంది పింఛన్‌దారులకు రూ.124.90 కోట్లు మంజూరైంది.

ఇన్‌చార్జ్ డీడీగా వెంకటేశ్వర్లు

అనంతపురం టౌన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టరుగా కడప జిల్లా డీడీ వెంకటేశ్వర్లుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ పనిచేస్తున్న రెగ్యులర్ డీడీ సరళ విజయకుమారి శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో కడప డీడీకి బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ఖజానాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

సమగ్రశిక్ష వార్షిక బడ్జెట్‌పై చర్చ

అనంతపురం విద్య, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్ర ప్రాజెక్టు 2025-26 వార్షిక బడ్జెట్(ఏడబ్ల్యూపీ అండ్ బడ్జెట్) ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు అధికారులు కసరత్తు మొదలెట్టారు. ఈక్రమంలోనే ఏపీసీ శైలజ సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులతో శుక్రవారం స మావేశం నిర్వహించారు. 2025-26 వార్షిక బడ్జెట్ కు అన్ని విభాగాల నుంచి సమగ్ర వివరాలను సేకరించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా సివిల్ వర్కులు, ఫైనాన్స్, అకడమిక్ మానిటరింగ్ విభాగం (ఏఎంఓ), గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ విభాగం(జీసీడీఓ) ప్లానింగ్, అలెస్కో, ఐఈడీ, ఇంజనీరింగ్, ఎస్టాబ్లిష్ తదితర విభాగాల నుంచి వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలు క్షుణ్ణంగా సేకరించాలన్నారు. కార్యక్రమంలో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ చంద్రశేఖర్‌రెడ్డి, వాణీదేవి, గోపాలకృష్ణ, నారాయణస్వామి, గురుమణికృష్ణ, సూపరింటెండెంట్ ఇక్బాల్ పాల్గొన్నారు.

5న అనంత ఉద్యాన సమ్మేళనం

అనంతపురం అర్బన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని ఎంవైఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఫిబ్రవరి ఐదో తేదీన అనంత ఉద్యాన సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సమ్మేళనంలో జాతీయ, అంతర్జాయ స్థాయి కంపెనీల ప్రతినిధులు, కొనుగోలుదారులు, ఎగుమతిదారులు పాల్గొంటారు. ఉమ్మడి జిల్లాతోపాటు రాయలసీమలోని ఇతర జిల్లాల నుంచి ఉద్యాన అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యులు కానున్నారు. అరటి, చీనీ, మిరప, టమోటా, మామిడి పంటల ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేందుకే ఈ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు ఉద్యాన శాఖ అధికారులు పేర్కొన్నారు. ఇదివరకు శుక్రవారం ఈ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించాలని భావించారు. అయితే అనివార్య కారణాల నేపథ్యంలో ఫిబ్రవరి ఐదో తేదీకి వాయిదా వేశారు.

ఆశలు.. తీరేనా..?

కొత్త, రద్దు చేసిన రైళ్లు పట్టాలెక్కేనా?

నేటి కేంద్ర బడ్జెట్‌లో రైల్వేకు కేటాయింపులెన్నో..!

విజయవాడకు కొత్త రైళ్లపై ప్రయాణికుల ఆశలు



నిర్మాణంలో ఉన్న గుంతకల్లు విద్యుత్ లోకో షెడ్

గుంతకల్లు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న తొలి పూర్తిస్థాయి బడ్జెట్‌లో రైల్వేకు ఏమేరకు కేటాయింపులు జరుగుతాయోనని రైల్వే ఉద్యోగులు, ప్రజలు ఎదురు చూస్తున్నారు. రైల్వే ప్రత్యేక బడ్జెట్‌ను రద్దుచేసి, కేంద్ర బడ్జెట్‌లో విలీనం చేసి తొమ్మిదేళ్ల పూర్తవుతోంది. అప్పటి నుంచీ ప్రతి ఏటా బడ్జెట్ ప్రసంగంలో రైల్వేల ప్రస్తావన తగ్గుతూ వస్తోంది. రైల్వేలకు గంపగుత్తగా నిధులను ఇవ్వడం, వందే భారత్ రైళ్లను ప్రకటించి మమ అనిపించడం ఆనవాయితీగా మారింది. తర్వాత విడుదల చేసే పింక్ బుక్‌లో వందే భారత్ రైళ్లు కాకుండా ప్రజావసరాల మేరకు డిమాండు ఉన్న రైళ్ల ప్రసక్తి ఉండటంలేదు. కాగా రాష్ట్రానికి కొత్త రైల్వే జోన్ రానున్న నేపథ్యంలో రాయలసీమ జిల్లాల నుంచి రాష్ట్ర రాజధానికి కొత్త రైళ్లు ప్రకటించాలన్న డిమాండ్ పెరిగింది. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటైతే గుంతకల్లు రెండో అతి పెద్ద డివిజన్‌గా అవతరిస్తుంది. ఈ మేరకు గుంతకల్లు-విజయవాడ-విశాఖపట్నం మధ్య కనెక్టివిటీ పెరుగుతుంది. దీంతో ఈ మార్గంలో కొత్త రైళ్ల ఆవశ్యకత ఏర్పడుతుంది. ఆ మేరకు ఈ బడ్జెట్‌లో కొత్త రైళ్లు ఏవైనా కేటాయిస్తారా? అన్న ఆసక్తి నెలకొని ఉంది.

రైళ్లు వచ్చేనా?

గుంతకల్లు రైల్వే డివిజన్ నుంచి గడచిన నాలుగేళ్లుగా కొత్త రైళ్లు, రద్దయిన పాత రైళ్లను నడపాలన్న డిమాండ్లు ఉన్నాయి. రైల్వే డివిజన్‌లో గతంలో నడచిన యశ్వంతపూర్-విజయవాడ ప్యాసింజరు, హుబ్లీ-విజయవాడ, కర్నూలు-గుంతకల్లు ప్యాసింజరు, బళ్లారి-గుంతకల్లు ప్యాసింజరు, రాయచూరు-గుంతకల్లు రైళ్లను కరోనా సమయంలో రద్దు చేసి పునరుద్ధరించలేదు. అలాగే కొల్హాపూర్-మణుగూరు ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశారు. కిందటి నెలలో ఈ రూటులో ఓ ప్రత్యేక రైలును నడిపి తర్వాత రద్దు చేశారు. ముంబై-చెన్నై (16511/12) ఎక్స్‌ప్రెస్, ముంబై-చెన్నై మెయిల్ (నం. 17008/09) ఎక్స్‌ప్రెస్, హుబ్లీ-విజయవాడ రైళ్లను పునరుద్ధరించాల్సిన అవసరముంది. 2008లో గుంతకల్లు-కల్లూరు లైన్ గేజ్ కన్వర్షన్ సమయంలో గుంతకల్లు-ధర్మవరం ఫాస్ట్ ప్యాసింజరు రైలును రద్దు చేశారు. 2010లో కల్లూరు లైన్ పునఃప్రారంభం తర్వాత ఫాస్ట్ ప్యాసింజరును పునరుద్ధరించలేదు. ఈ రైలును మరలా నడపాలని పదిహేనేళ్లుగా స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గుంతకల్లు నుంచి విజయవాడకు వెళ్లడానికి అమరావతి, ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లు మినహా తగిన రైళ్లు లేవు. కనుక రాష్ట్ర రాజధానికి కొత్త రైళ్లు రావాలని కోరుతున్నారు.

నిధులు ఏ మేరకో...

హైస్పీడ్ రైళ్లను ప్రవేశపెట్టడం, సరుకు రవాణా వేగవంతంగా జరిగేలా చేసే లక్ష్యంతో ఈ బడ్జెట్‌లో అధిక నిధులను కేటాయించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రధాన రైలు మార్గాలలో డబ్లింగ్ పూర్తిచేయడం, ట్రాక్ రీప్లేస్మెంట్, సరుకు రవాణా కోసం ట్రిపుల్, క్వాడ్రాపుల్ లైన్లకు అగ్రతాంబూలమిచ్చేలా కనిపిస్తోంది. గుంతకల్లు రైల్వే డివిజన్‌లో రైళ్లను 130 కిమీల వేగంతో నడపడానికి నిర్ణయించి,



వివిధ రూట్లతో అనుసంధానించాల్సి ఉన్న 1, 2-3 ప్లాట్‌ఫారాల లైన్లు

రైల్వే లైన్లు సక్రమంగా లేని కార ణంగా ఆ ప్రయత్నాన్ని విరమించారు. ఈ బడ్జెట్‌లో డివిజన్‌కు లైన్ల పునరుద్ధరణకు ఎక్కువ నిధులు లభించే అవకాశాలున్నాయి. గుంతకల్లులో పుష్కర కాలం నుంచీ నిర్మాణంలో ఉన్న ఎలెక్ట్రిక్ ట్రాక్షన్ షెడ్డు పూర్తి కావడం లేదు. అతి తక్కువగా నిధుల కేటాయింపు జరుగుతుండటంతో పనులు నత్తనడకన జరుగుతున్నాయి. షెడ్ నిర్మాణం పూర్తికి నిధుల కేటాయింపు జరగాల్సి ఉంది. గుత్తి-పెండేకల్లు, ధర్మవరం-పాకాల లైన్ డబ్లింగ్ కోసం నిధులు లభించే అవకాశాలున్నాయి. నిర్మాణం అంతిమ దశకు చేరిన గుంతకల్లు-గుంటూరు డబ్లింగ్ ప్రాజెక్టుకు, కడప-బెంగళూరు, శ్రీకాళహస్తి-నడికుడి లైన్ల నిర్మాణ ప్రాజెక్టులకు నిధులు విడుదలయ్యే పరిస్థితి ఉంది. గుంతకల్లు రైల్వే స్టేషన్‌లోని 1, 2-3 ప్లాట్‌ఫాంలను విజయవాడ, చెన్నై లైన్లకు అనుసంధానం చేయడానికి గత బడ్జెట్‌లో అనుమతి ఇచ్చారు. నిధులు విడుదలకాక పనులు ప్రారంభం కాలేదు. ఆ పనులకు నిధులు లభించాల్సి ఉంది.

రైల్వే ఉద్యోగుల ఆశలు

రైల్వే ఉద్యోగులు వ్యతిరేకిస్తున్న కొత్త పెన్షన్ స్కీం స్థానంలో యూనిఫైడ్ పెన్షన్ స్కీం రావడంతో కాస్త శాంతించిన ఉద్యోగులు మరి కొన్ని డిమాండ్లను చేస్తున్నారు. కరోనా సమయంలో రావాల్సిన 18 నెలల డీఏను ఈ బడ్జెట్ ద్వారా విడుదల చేయాలని, కొవిడ్-19లో చనిపోయిన ఉద్యోగులకు రూ.50 లక్షల పరిహారాన్ని ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. ఉద్యోగులకు ఆదాయపు పన్ను విధింపు కనిష్ఠ ఆదాయం రూ.5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచాలని ఆశిస్తున్నారు. శిథిలమైపోయిన రైల్వే క్వార్టర్స్‌ను పునర్నిర్మించాలని కోరుతున్నారు. లోకో రన్నింగ్ స్టాఫ్‌కు లభిస్తున్న కి.మీ. అలవెన్సును ఆదాయపు పన్ను పరిధి నుంచి మినహాయించాలని డిమాండ్ చేస్తున్నారు.

'కొవిడ్ రైళ్ల'ను నడపాలని కోరా



కొవిడ్-19 సమయంలో పలు ప్యాసింజరు రైళ్లు, ఎక్స్‌ప్రెస్‌లను నిలిపేశారు. వాటిని పునరుద్ధరించాలంటూ డీఆర్ఎం ద్వారా రైల్వే మంత్రిత్వ శాఖకు విన్నపం పంపాము. గుంతకల్లులో ట్రాఫిక్‌కు సమస్యగా మారిన ధర్మవరం గేటు, బళ్లారి బైపాస్ లెవెల్ క్రాసింగ్‌లను తొలగించి ఆర్‌యూబీలను నిర్మించాలని, రాష్ట్ర రాజధానికి గుంతకల్లు నుంచి ఎక్స్‌ప్రెస్, ప్యాసింజరు రైళ్లను నడపాలని ప్రతిపాదించాం.

-ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

ఆదాయ పన్ను మార్జిన్‌ను పెంచాలి



కేంద్ర ఉద్యోగులకు ఆదాయ పన్ను విధింపు స్లాబ్‌లను పెంచాలని కొన్నేళ్ల నుంచీ డిమాండ్ చేస్తున్నాం. కనీస ట్యాక్స్ మొత్తం రూ.5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచాల్సిన అవసరం ఉంది. గ్రూప్-4 ఉద్యోగులు పూర్తిగా ఆదాయపు పన్ను పరిధిలో లేని విధంగా స్లాబ్‌లను ఏర్పరచాలి. రైల్వే క్వార్టర్సు నిర్మాణ కార్యక్రమం కొన్నేళ్లుగా నిలిపి వేశారు. గత సంవత్సరం తొలిసారిగా అరకొర నిధులు ఇచ్చారు. డివిజన్ హెడ్ క్వార్టర్స్‌లోనే వెయ్యి క్వార్టర్సును నిర్మించాల్సి ఉంది. ఇక సైడింగ్ స్టేషన్లలో ఉన్న క్వార్టర్స్ అన్నీ శిథిలావస్థలో ఉన్నాయి. కరోనాలో పెండింగ్‌లో ఉంచిన రైల్వే ఉద్యోగుల డీఏ బకాయిలు, చనిపోయిన ఉద్యోగులకు రూ. 50 లక్షల పరిహారానికి సంబంధించి ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి.

- ప్రభాకర్, ఎంప్లాయీస్ సంఘ్ డివిజనల్ కార్యదర్శి

కేడర్ రీకన్‌స్ట్రక్షన్ చేయాలి



2023 నుంచి కేడర్ రీకన్‌స్ట్రక్షన్ జరగలేదు. ఉద్యోగులకు ప్రమోషన్లలో జాప్యం జరుగుతోంది. వెంటనే కేడర్ రీకన్‌స్ట్రక్షన్‌కు అనుమతులివ్వాలి. 8వ ఆర్థిక సంఘాన్ని నియమించారు. అది త్వరగా సిఫారసులను ఇవ్వడానికి తగిన విధంగా బడ్జెట్‌లో నిధులను కేటాయించాలి. రైళ్లను పెంచుతున్నారుగానీ, అందుకు తగినట్లు ఉద్యోగ నియామకాలు చేయడం లేదు. పని ఒత్తిడిని తగ్గించడానికి ఉద్యోగ నియామకాలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలి.

-విజయకుమార్, మజ్దూర్ యూనియన్ డివిజనల్ కార్యదర్శి

క్రైం కార్నర్

గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

తాడిపత్రి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాలయం సమీపంలో ఉన్న రజక కల్యాణ మండపం వద్ద శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. మృతుడి వయసు సుమారు 50సంవత్సరాలు ఉంటుందన్నారు. మృతదేహంపై నీలం రంగు చొక్కా, ఆకుపచ్చ ప్యాంట్ ఉన్నట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

పాముకాటుతో రైతు..


వెంకటేష్(ఫైల్)

గుంతకల్లుటౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైనాపురం గ్రామానికి చెందిన రైతు వెంకటేష్ (55) శుక్రవారం పాముకాటుతో మృతిచెందాడు. మృతుడి బంధువులు తెలిపిన మేరకు వెంకటేష్‌కు ఆరు ఎకరాల పొలం ఉంది. ఒక ఎకరంలో వేరుశనగ పంట సాగుచేశాడు. పంటకు నీరు పెట్టేందుకు వెంకటేష్ వెళ్లాడన్నారు. పొలంలో పాము కరవడంతో వెంకటేష్ స్పృహ తప్పిపడిపోయాడు. పక్కపొలంలోని రైతులు గుర్తించి వెంకటేష్‌ను వారి ఇంటికి తీసుకెళ్లారు. కుటుంబసభ్యులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య తులశమ్మ, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

జుత్తు కత్తిరించిన కేసులో మరో 8 మంది అరెస్టు

పెనుకొండ రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జుత్తు కత్తిరించిన కేసులో మరో ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు కియ ఇండస్ట్రియల్ స్టేషన్ ఎస్ఐ రాజేష్ శుక్రవారం తెలిపారు. మండలంలోని మునిమడుగు గ్రామంలో ప్రేమజంటకు సహకరించిందని అదే ఊరికి చెందిన వెంకటలక్ష్మిపై జనవరి 14న యువతి కుటుంబ సభ్యులు విచక్షణారహితంగా దాడిచేసి, జుత్తు కత్తిరించారు. బాధితురాలు.. 20మందిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారిలో ఇదివరకే 11మందిని పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం మరో ఎనిమిది మందిని అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరచినట్లు ఎస్ఐ వివరించారు.

టమోటా కిలో రూ.20



అనంతపురం రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.20తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శుక్రవారం 750 టన్నుల టమోటాలు వచ్చాయని, కిలో సరాసరి ధర రూ.14, కనిష్ఠ ధర రూ.10 పలికినట్లు ఆయన తెలిపారు.

936 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జీడిపల్లి రిజర్వాయరుకు శుక్రవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 936 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 467 క్యూసెక్కులు వెళుతోందన్నారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

ఉద్యోగాలకు 48మంది విద్యార్థుల ఎంపిక

అనంతపురం సెంట్రల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జాబ్‌మేళాలో ప్రతిభ కనబర్చిన 48మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. కేఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ సత్యలత అధ్యక్షతన శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. నైపుణ్యాభివృద్ధి, జిల్లా ఉపాధికల్పన, సీడాప్ సంస్థల సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో ఐదు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధి కల్పనాధికారి కళ్యాణి, కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అనురాధ, నారాయణస్వామి పాల్గొన్నారు.

మిట్స్‌కు 4స్టార్ రేటింగ్

అనంతపురం సెంట్రల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ అనుబంధ మిట్స్ కళాశాలకు విద్యామంత్రిత్వ శాఖ 4స్టార్ రేటింగ్‌ను ఇచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ప్రత్యేకంగా ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సెలింగ్(ఐఐసీ) సెల్‌ను ఏర్పాటు చేశామన్నారు. తద్వారా నూతన పరిశోధనలు, స్టార్టప్‌లపై అధ్యాపకులు, విద్యార్థులకు శిక్షణా తరగతులు నిర్వహించి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ కీర్తి నాదెండ్ల కృషితో 4స్టార్ ర్యాంకును సాధించామని హర్షాన్ని వ్యక్తంచేశారు.


విద్యామంత్రిత్వ శాఖ 4స్టార్ రేటింగ్ సర్టిఫికెట్‌ను అందుకున్న ప్రిన్సిపాల్ యువరాజ్

- అక్రమంగా కొండరాళ్లు, మట్టి తరలింపు
- కొండలు తవ్వడంతో గాలిమరల పరిస్థితి ప్రశ్నార్థకం
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- భారీగా సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు

కొండను కొట్టి... మట్టిని పట్టి..!

- మట్టి తరలింపుపై వివాదాలు


ఏ. కొండాపురం వద్ద మట్టి లోడింగ్‌కు వచ్చిన టిప్పర్లు

పుట్లూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రకృతి సంపదను కొందరు స్వార్థపరులు యథేచ్ఛగా కొల్లగొడుతున్నారు. వీరి దెబ్బకు కొండలు, గుట్టలు కనుమరుగవుతున్నాయి. అయితే అక్రమార్కుల జేబులు మాత్రం కాసులతో నిండిపోతున్నాయి. అనుమతులు లేకుండా మట్టిని తవ్వుతూ, టిప్పర్లు పెట్టి లక్షలాది రూపాయలకు విక్రయిస్తున్నారు. మండలంలోని పుట్లూరు, చింతకుంట, ఏ. కొండాపురం, అరకటవేముల, సూరేపల్లి, కడవకల్లు, చాలవేముల, నారాయణరెడ్డిపల్లి, కొండుగారికుంట, గరుగుచింతలపల్లి, కోమటికుంట్ల, బాలాపురం, పి. చింతలపల్లి తదితర గ్రామాల్లో ఎక్కువగా కొండలు ఉన్నాయి. వీటిలో వ్యవసాయ భూములకు ఉపయోగించే కొండమట్టి, మరికొన్నిచోట్ల రోడ్లకు ఉపయోగించు గరుసుమట్టి ఎక్కువగా ఉంటోంది. ఈమట్టిని కొందరు వ్యక్తులు ఎక్స్‌కవేటర్లు పెట్టి తవ్వుతూ టిప్పర్లతో రవాణా చేస్తూ లక్షలు ఆర్జిస్తున్నారు. చింతకుంట సర్వేనెంబరు 1లో సుమారు 800ఎకరాలకు పైగానే కొండ ప్రాంతం ఉంది. వీటిలో జాతీయ రహదారి 544-డీకి అనుమతులు తీసుకొని మట్టిని తరలిస్తున్నారు. కానీ వీటిని అడ్డుపెట్టుకొని కొందరు కాంట్రాక్టర్లు మట్టిని ఇతర గ్రామాలకు తరలిస్తున్నారు. ఇప్పటికే ఏ. కొండాపురం పంచాయతీ పరిధిలో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని ఆ గ్రామ చంద్రదండు నాయకులు అడ్డుపడి టిప్పర్‌ను ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. కానీ ఇలాంటి సంఘటన చింతకుంట గ్రామశివార్లలో కూడా జరిగింది. అక్కడ కొండప్రాంతాన్ని బ్లాస్ట్ చేసి, రాళ్లను సైతం క్రషర్లకు తరలిస్తున్నారు. అనుమతులు లేకుండానే ఈ కార్యక్రమాలు చేసుకుంటున్నట్లు సమాచారం. క్రషర్లకు కేటాయించిన భూమిలో కాకుండా ఇతరచోట్ల ఎక్స్‌కవేటర్‌తో రాళ్లను తవ్వేసి, కంకర ఫ్యాక్టరీలకు రవాణా చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

గాలి మరల పరిస్థితి ప్రశ్నార్థకం

మండలంలో పెద్దఎత్తున వివిధ కంపెనీలకు చెందిన గాలిమరలు ఉన్నాయి. వీటిని కొండపైన ఏర్పాటు చేశారు. వీటి చుట్టుపక్కల ఉన్న మట్టిని సైతం తోడేస్తున్నారు. దీంతో గాలిమరల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఈ తవ్వకాలు ఇలాగే కొనసాగితే గాలిమరలు నేలకొరిగే ప్రమాదం ఉన్నట్లు ఆయా కంపెనీల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాలిమరల చుట్టూ సుమారు వందమీటర్ల మేర ఎలాంటి నిర్మాణాలు, తవ్వకాలు చేపట్టకూడదని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. కానీ ఇక్కడ గాలిమరలకు దగ్గరగానే తవ్వకాలు చేస్తున్నారు. ఏ. కొండాపురం, అరకటవేముల, పుట్లూరు, నారాయణరెడ్డిపల్లి గ్రామాల శివార్లలో గాలిమరలకు దగ్గరగా కొండను తవ్వుతున్నారు.


నారాయణరెడ్డిపల్లి వద్ద గుట్టను తవ్విన దృశ్యం

చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

కొండల్లో మట్టి, రాళ్లను పెద్దఎత్తున తరలిస్తున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. మైనింగ్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు కాంట్రాక్టర్లు అధికారులను కలిసి ఆమ్యామ్యాలు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. కొందరు క్రషర్ యజమానులకు ఒక హెక్టార్‌కు మించి అనుమతులు ఇవ్వకూడదన్న నిబంధన ఉంది. కానీ ఇక్కడ మాత్రం హెక్టార్ సంగతి దేవుడెరుగు కొండ ప్రాంతంలో ఎక్కడైనా తవ్వుకొని రవాణా చేసుకో..! ఎవరు వస్తారో నేనుచూసుకుంటా అని ఓ అధికారి అభయం ఇచ్చినట్లు తెలిసింది.

పశువులను ఎక్కడికి తీసుకెళ్లాలి?



మండలంలో కొండలను తవ్వేసి రాళ్లు, మట్టిని అమ్ముకుంటున్నారు. ఇలానే కొనసాగితే కొండలు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. మా ఊరి గ్రామశివారులో పెద్దఎత్తున కొండను తవ్వుతున్నారు. దీంతో కొండకు వెళ్లి మేతమేసే పశువులను ఇప్పుడు ఎక్కడికి తీసుకువెళ్లాలో అర్థం కావడం లేదు. అధికారులు స్పందించి ఇలాంటి ఆగడాలను అరికట్టాలి.

- రామానాయుడు, సూరేపల్లి

నా దృష్టికి రాలేదు



కొండప్రాంతాల్లో మట్టిని తవ్వుతున్నట్లు నా దృష్టికి రాలేదు. వస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. మట్టి తరలింపునకు ఎవరికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. ఆయా గ్రామాల్లో మట్టిని అక్రమంగా తరలిస్తుంటే మాకు సమాచారం ఇస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

- శేషారెడ్డి, తహసీల్దార్

సిండికాటు..!

- అరటివ్యాపారుల మిలాఖత్
- వారంలోనే అమాంతం తగ్గిన ధర
- టన్నుపై రూ.5వేల నుంచి రూ.7వేలు తగ్గింపు
- నష్టపోతున్న అరటి రైతులు


రాయలచెరువులో సాగుచేసిన అరటి పంట

యాడికి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తులు, చీడపీడలతో పోరాడి రైతన్న పంటను పండిస్తే కొందరు కేటుగాళ్లు సిండికేట్ అయ్యి అధిక దిగుబడిని కాటు వేస్తున్నారు. పంట దిగుబడి రాకముందు ఉన్న ధర చేతికొచ్చే క్రమంలో అమాంతం తగ్గించి వేస్తున్నారు. ప్రస్తుతం అరటి విషయంలో ఇదే జరుగుతోంది. వ్యాపారులు, వివిధ కంపెనీలు సిండికేట్ అయ్యి అరటి ధరను అమాంతం తగ్గించేశారు. టన్ను అరటిపై రూ.5వేల నుంచి రూ.7 వేల వరకు తగ్గించేశారు. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో అరటి కొనుగోలు చేసే వివిధ కంపెనీల ప్రతినిధులు, వ్యాపారులు జనవరి 30న నార్పలలో రహస్య సమావేశం నిర్వహించి సిండికేట్ అయ్యారని బాధితులు ఆరోపిస్తున్నారు.

వారంలోనే తేడా..

వారం రోజుల కిందట అరటి టన్ను రూ.25వేల నుంచి రూ.27వేల వరకు పలికింది. తాము పడ్డ కష్టానికి తగిన ప్రతిఫలం దక్కిందని రైతులు సంతోషపడ్డారు. గతంలో అరటి మిగిల్చిన నష్టాలను ఈ ఏడాది తీర్చేసుకోవచ్చని ఆశపడ్డారు. కానీ వారి ఆశలపై కొనుగోలు కంపెనీలు, వ్యాపారులు నీళ్లు చల్లారు. తాము చెప్పిన ధరకు అయితేనే కొంటామని చెప్పుకుంటూ నాలుగురోజులుగా అరటి కొనుగోలును తగ్గించుకుంటూ వచ్చారు. జనవరి 30న అంతా ఒకచోట చేరి రహస్య సమావేశం నిర్వహించినట్లు తెలిసింది. అక్కడ అరటి కొనుగోళ్లపై నిబంధనలు ఏర్పాటు చేసుకున్నట్లు రైతులు చర్చించుకుంటున్నారు. సమావేశంలో అరటి గ్రేడింగ్‌ను బట్టి టన్ను రూ.20వేల నుంచి రూ.22వేలకు మాత్రమే కొనుగోలు చేయాలని, అంతకు మించి ధర వెచ్చించరాదని నిర్ణయించినట్లు తెలిసింది. ఇదే అమలైతే పెద్దగా గిట్టుబాటు కాదని పలువురు అరటి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి అరటికి ఇరాన్, ఇరాక్ దేశాల్లో మంచి డిమాండ్ ఉంది. ఇక్కడి పంటను కొనుగోలు చేసే కంపెనీలు అక్కడకు తరలించి మంచి లాభాలు ఆర్జిస్తున్నారని, కానీ రైతులకు ధర చెల్లించడానికి మాత్రం ఆలోచించడంపై ఆగ్రహం వ్యక్తం అవుతోంది. తాడిపత్రి నియోజకవర్గ పరిధిలోనే సుమారు 5వేల ఎకరాల్లో రైతులు అరటి సాగు చేశారు. మొదటి పంటలోనే లక్ష టన్నులకు పైగా దిగుబడి తీస్తారు. వ్యాపారులు టన్నుకు రూ.5వేల నుంచి 7వేల వరకు తగ్గించడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. వ్యాపారుల సిండికేట్‌తో నియోజకవర్గ పరిధిలోని రైతులు అరటిపంట దిగుబడిపై సుమారు రూ.50కోట్లకుపైగా నష్టపోవాల్సి వస్తోంది. జిల్లా ఉన్నతాధికారులు, ఉద్యానశాఖ అధికారులు సంయుక్తంగా అరటి కొనుగోలు చేసే కంపెనీల ప్రతినిధులు, వ్యాపారులతో చర్చలు జరిపి గిట్టుబాటు ధర కల్పించాలని అరటి రైతులు కోరుతున్నారు.

తీవ్ర నష్టం



వారం రోజుల కిందటి వరకు అరటి టన్ను రూ.27వేల వరకు ధర పలికింది. ఐదు రోజుల నుంచి అరటి దిగుబడిని వ్యాపారులు కొనకుండా నిలిపివేశారు. అరటి కొనుగోలు జరిపే వివిధ కంపెనీల ప్రతినిధులు, వ్యాపారులు అంతా సిండికేట్ అయ్యి ధరను అమాంతం తగ్గించేశారు. అరటి టన్నుపై ఏకంగా రూ.5వేల నుంచి 7వేల వరకు తగ్గించడం దారుణం. దీనివలన అరటి రైతులు బాగా నష్టపోతారు. ఉద్యానశాఖ అధికారులు తగు చర్యలు చేపట్టాలి.

- పరిమి చరణ్, రైతు, రాయలచెరువు

టన్నుకు వంద కిలోల షూట్



అరటి కొనుగోలు చేసే వివిధ కంపెనీల ప్రతినిధులు, వ్యాపారులు, సిండికేట్ అయి రైతులకు నష్టం కలిగించే విధంగా చేస్తున్నారు. వ్యాపారులు టన్నుకు వంద కిలోల షూట్ తీస్తున్నారు. ఇప్పుడు అంతా సిండికేట్ అయి అరటి ధరను అమాంతం తగ్గించేయడం తగదు. ఉద్యాన శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలి. అరటి రైతులు నష్టపోకుండా చూడాలి.

- కుమార్, అరటిరైతు, కొత్తపల్లి

మాకు వందమీటర్ల దూరంలో తొక్కిసలాట

విడపనకల్లు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన తొక్కిసలాటకు వందమీటర్ల దూరంలోనే తాము ఉన్నట్లు పలువురు భక్తులు వెల్లడించారు. విడపనకల్లుకు చెందిన వలిపిరెడ్డి వెంకటరమణారెడ్డి, అనంతపురానికి చెందిన కేశవరెడ్డి, శ్రీహరిరెడ్డి, కర్నూలుకు చెందిన గోపాలకృష్ణ స్నేహితులు. వీరు నలుగురూ నాలుగు రోజుల కిందట కారులో కుంభమేళాకు వెళ్లారు. ప్రయాగ్ రాజ్‌లో బుధవారం రాత్రి జరిగిన తొక్కిసలాట సమయంలో వీరు అక్కడే ఉన్నట్లు తెలిపారు. అందరూ కలిసే ఉన్నా, తొక్కిసలాట తర్వాత ఎవరికి వారుగా విడిపోయారు. కారు పార్కింగ్ వద్దకు ఒక్కొక్కరుగా చేరుకోవటంతో నలుగురు మిత్రులు ఊపిరి పీల్చుకున్నారు. తొక్కిసలాట జరిగిన వెంటనే ఆ ప్రాంతంలో ఒక్కరిని కూడా ఉండనీయకుండా ఖాళీ చేయించినట్లు పేర్కొన్నారు.

కుంభమేళాకు బస్సులు



జెండా ఊపి యాత్రను ప్రారంభిస్తున్న పూల నాగరాజు

రాయదుర్గం రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళాకు జిల్లా నుంచి బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ కడప రీజనల్ చైర్మన్ పూల నాగరాజు పేర్కొన్నారు. మహాకుంభమేళా యాత్ర కు ఆర్టీసీ డిపో వద్ద ఏర్పాటు చేసిన రెండు బస్సులను శుక్రవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే తొలిసారిగా మహాకుంభమేళా యాత్రకు రాయదుర్గం నుంచి బస్సులు ఏర్పాటు చేశామన్నారు. 11 రోజుల పాటు జరిగే ఈ యాత్రలో ప్రయాణికులు కూడా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీనివాసరావు, కార్గో డీఎంఈ నాగరాజు, గ్యారేజ్ ఇన్‌చార్జ్ శిరీష, అసిస్టెంట్ మేనేజర్ సురేంద్రబాబు, యూనియన్ నాయకులు తిప్పేస్వామి, రామలింగ తదితరులు పాల్గొన్నారు.

పురంలో విప్ రాజకీయం..!

పార్టీ మారిన వారిని భయపెట్టేందుకు వైసీపీ యత్నాలు

- ఆరు నెలల కిందటే సస్పెన్షన్
- అయినా.. విప్ జారీ యోచన
- సర్వత్రా విమర్శలు

హిందూపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలో విప్ రాజకీయానికి వైసీపీ ఎత్తులు వేస్తున్నట్లు సమాచారం. మున్సిపల్ చైర్మన్ ఉప ఎన్నికల్లో పార్టీ నుంచి సస్పెండ్ వారికి సైతం విప్ జారీ చేయాలని కుటిల రాజకీయానికి తెరలేపుతున్నట్లు తెలుస్తోంది. ఇది పట్టణంలో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. వైసీపీ ఐదేళ్ల పాలనలో నమ్ముకున్నవారికి ఏమీ చేయలేదనీ, ముఖ్యంగా ఓటేసిన వార్డులోని ప్రజలకు రూపాయి పనిచేసి పెట్టలేదని ఆ పార్టీ కౌన్సిలర్లు ఆవేదనకు లోనయ్యారు. వార్డు ప్రజలకు మొహం చూపించలేని పరిస్థితి ఎదుర్కొన్నారు. పార్టీలో ఉండటంకంటే టీడీపీలో చేరి వార్డు అభివృద్ధికి పాటుపడడమే మేలని నిర్ణయించుకున్నారు. ఆ మేరకు వైసీపీకి చెందిన కౌన్సిలర్లు తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరిని ఆరు నెలల క్రితమే పార్టీ నుంచి సస్పెండ్ చేశారు కూడా. ప్రస్తుతం మున్సిపల్ చైర్మన్ ఉప ఎన్నిక నేపథ్యంలో వైసీపీ కుతంత్ర రాజకీయానికి పూనుకుంది. పార్టీ మారిన వారిని భయపెట్టేందుకు విప్ అనే పదంతో ప్రయత్నిస్తున్నారు. పార్టీ మారినవారు ఏమాత్రం జంకకుండా అభివృద్ధి చేసేవారికే తమ మద్దతు ప్రకటించాలనీ, ఎట్టి పరిస్థితుల్లోనూ అడుగు వెనకేసే ప్రసక్తేలేదని కరాఖండిగా చెబుతున్నారు.

భయపెట్టే ప్రయత్నం

హిందూపురం మున్సిపాలిటీలో 38 మంది కౌన్సిలర్లు ఉన్నారు. 2021 ఎన్నికల్లో 29 మంది కౌన్సిలర్లు వైసీపీ తరఫున గెలుపొందారు. వీరిలో 13మంది టీడీపీ వైపు వచ్చారు. సాధారణంగా గెలుపొందిన సభ్యుల్లో మరీ ముఖ్యంగా చైర్మన్ ఎన్నిక సందర్భంగా హాజరయ్యే సభ్యుల్లో 2/3 వంతు ఆమోదం తెలిపితే విప్‌పై చర్యలకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీవైపే మెజార్టీ సభ్యులున్నారు. అలాంటపుడు వారికి విప్ వర్తించదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. వైసీపీ ముఖ్యనేతలు మాత్రం విప్‌తో రాజకీయం చేస్తూ పార్టీ మారిన వారిని భయపెట్టేందుకు ఈ పదం తెరపైకి తెచ్చినట్లు తెలుస్తుంది. ఒకవేళ విప్ జారీచేసినా, వారికి వర్తించినా వారు కోర్టుకు వెళ్లే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా వారి పదవీకాలం ఏడాది మాత్రమే ఉండటంతో గతంలో ఇలాంటివి వేరేచోట జరిగినపుడు కోర్టుకు వెళ్లగా ఏడాది, మూడేళ్లు పట్టింది. ముఖ్యంగా వైసీపీ విప్‌తో రాజకీయం చేయాలని భావిస్తే పార్టీ మారిన వారు టీడీపీ తరఫున కోర్టుకు వెళ్లే యోచనలో ఉన్నారు.

ఆరునెలల కిందటే సస్పెన్షన్

గతేడాది సార్వత్రిక ఎన్నికలకు ముందు కొంతమంది, ఆగస్టులో మరికొంతమంది వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరిని



అప్పట్లోనే ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. అలాంటి వారికి ఇప్పుడెలా విప్ జారీ చేస్తారని పార్టీ మారినవారు ప్రశ్నిస్తున్నారు. ఎప్పుడైనా తమ పార్టీ గుర్తుతో గెలుపొందినవారు పార్టీ ఫిరాయిస్తే వెంటనే సస్పెండ్ చేయాల్సిన అవసరం ఉంటుంది. ఆరు నెలల తరువాత చైర్మన్ ఎన్నిక కోసం విప్ జారీ చేయాలని భావిస్తే వారిని మరోసారి పార్టీ నుంచి సస్పెండ్ చేసి విప్‌పై పోరాడతారా, ఆరు నెలల క్రితమే సస్పెండ్ చేసిన దానిని పట్టుకుని విప్ జారీచేస్తారా వేచి చూడాలి. ఇది న్యాయపరంగా, రాజకీయపరంగా ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనిపై న్యాయ నిపుణులతో సంప్రదించాక వైసీపీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి. ఆరు నెలల క్రితమే తమను సస్పెండ్‌చేసి, ఇప్పుడు విప్ ఇవ్వడం వైసీపీకి సిగ్గుచేటని టీడీపీలోకి చేరిన వారు విమర్శిస్తున్నారు. వైసీపీ నీచ రాజకీయాలకు తెరలేపుతోందని ఆ పార్టీకి సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా మార్పు రాలేదంటూ టీడీపీ విమర్శలు గుప్పిస్తోంది. ఏది ఏమైనా హిందూపురం మున్సిపల్ చైర్మన్ ఎన్నికను వైసీపీ రాజకీయం చేయాలని భావిస్తోందనీ, అందులో భాగంగానే విప్‌ను తెరపైకి తెచ్చినట్లు చర్చ సాగుతోంది.

న్యూస్ బాక్స్

గుడిసెలను పరిశీలించిన ఆర్డీఓ



వివరాలు నమోదు చేసుకుంటున్న అధికారులు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

అనంతపురంరూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపమురాయి చెరువుకు ఆనుకుని ప్రభుత్వ భూమిని ఆక్రమించి వేసిన గుడిసెలపై ఈనెల 30న ఆంధ్రజ్యోతిలో 'ఎవరిది బాధ్యత' అన్న శీర్షికన ప్రచురించిన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. ఈ మేరకు శుక్రవారం ఆర్డీఓ కేశవనాయుడు, తహసీల్దార్ మోహన్‌కుమార్ గుడిసెలను పరిశీలించారు. గుడిసెలు వేసుకున్నవారిని పిలిపించి మాట్లాడారు. సోములదొడ్డి గ్రామ సర్వే నెంబరు 160లో 74.03 ఎకరాల పాపమురాయి చెరువుకు సంబంధించినదని తెలిపారు. ఎకరా విస్తీర్ణంలో బుడగ జంగమ కులాలకు చెందిన 48 కుటుంబాలు గుడిసెలు వేసుకుని ఆక్రమించుకున్నారని పేర్కొన్నారు. గృహ నిర్మాణం పథకంలో అర్హులకు ఇంటి స్థలాలు కేటాయించుటకు చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ సందీప్‌కృష్ణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

కెరీర్ అవకాశాలపై అవగాహన

అనంతపురం రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): స్థానిక పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ, సీఎస్‌జీ విభాగం, కెరీర్ గైడెన్స్ సెల్ సంయుక్తంగా కెరీర్ అవకాశాలపై శుక్రవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బెంగళూరు ఐఐఎస్సీ ప్రొఫెసర్ రమేష్ కరుపన్నన్ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు, సిబ్బంది దిలీప్‌వెంకటకుమార్, ధరణి, వీణ, వహీదా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాహక్కుల పరిరక్షణ కోసమే ప్రాజెక్టు-5

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రజాహక్కుల పరిరక్షణ కోసమే ప్రాజెక్టు-5 ఆర్గనైజేషన్‌ను స్థాపించామని వ్యవస్థాపక అధ్యక్షుడు దీపక్ దయానంద్ తెలిపారు. శుక్రవారం ఆర్గనైజేషన్ ప్రారంభోత్సవాన్ని ఆ సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దీపక్ దయానంద్ మాట్లాడుతూ... ప్రజా హక్కులు కాపాడటం, అవసరాలకు సహాయం, రాజ్యాంగ బద్ధమైన విధానాలను అనుసరించడం కోసం ప్రాజెక్టు-5 పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో సభ్యులు మహేష్, సునంద బిల్లా, సుధీర్, విజయ్‌కుమార్‌రెడ్డి, సుకుమార్, నవీన్, అశోక్, ఎర్రిస్వామి, వంశీ పాల్గొన్నారు.

వేధిస్తున్న అధికారిని సస్పెండ్ చేయాలి

అనంతపురం అర్బన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : సత్యసాయి జిల్లా హిందూపురం మున్సిపాలిటీలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న దివ్యాంగ ఉద్యోగి శంకర్‌ను వైకల్యం పేరుతో మానసికంగా వేధిస్తున్న ఇన్‌చార్జి మున్సిపల్ ఇంజనీర్ బాలసుబ్రహ్మణ్యంను సస్పెండ్ చేయాలని ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం అనంతపురం జిల్లా కేంద్రంలో పబ్లిక్ హెల్త్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రామమోహన్‌రెడ్డికి సమితి రాష్ట్ర అధ్యక్షుడు షఫీ, జిల్లా అధ్యక్షుడు సాకే ఆంజినేయులు, ఉమ్మడి అనంత జిల్లా కోఆర్డినేటర్ హరినాథ్‌రెడ్డిలు ఫిర్యాదు చేశారు.

ఎంపీడీవోగా భాస్కర్

శింగనమల జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోగా భాస్కర్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో నిర్మలాకూమారి శుక్రవారం పదవీ విరమణ చేయడంతో గుత్తి ఎంపీడీవోగా ఉన్న భాస్కర్‌ను ఆ స్థానంలో నియమించారు. ఈ మేరకు బాధ్యతలు చేపట్టారు.

మినిమమ్ టైం స్కేల్ వర్తింపజేయండి

అనంతపురం అర్బన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖలో పదేళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఎంపీఈఓలకు మినిమమ్ టైం స్కేల్ వర్తింపజేలా చర్యలు తీసుకోవాలని ఎంపీఈఓల సంఘం నాయకులు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఉవరకొండలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, నాయకులు భాగ్యలక్ష్మి, తిరుపతయ్యలు వినతి పత్రం అందజేశారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

కనగానపల్లి జనవరి 31(ఆంధ్రజ్యోతి): ముద్దెలచెరువు జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థుల పరిటాల రవీంద్ర ట్రస్టు తరపున శుక్రవారం విద్యాసామాగ్రిని టీడీపీ నాయకులు పంపిణీచేశారు. కార్యక్రమంలో నాయకులు సంగమేశ్, నరసింహులు, రామాంజి, శివలింగ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో రూ.1.82 లక్షల అవినీతి

కనగానపల్లి జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద తనిఖీ బృందం రూ.8 కోట్ల పనులకుగాను రూ.1.82లక్ష అవినీతి తేల్చింది. మండల వ్యాప్తంగా 2023 నుంచి 2024 వరకు ఉపాధి హామీ పథకం కింద రూ.8కోట్లు ఖర్చు చేశారు. శుక్రవారం కనగానపల్లిలో ప్రజా వేదికను నిర్వహించారు. రూ.1.81 లక్షల అవినీతి జరిగినట్టు బహిరంగ సభలో వెల్లడించారు. కార్యక్రమంలో ఏపీడీ శివశంకర్, చలపతి, నాగేశ్వర్, ఎంపీపీ కె.బాగ్యమ్మ, ఎంపీడీఓ అనిల్‌కుమార్, ఏపీఓలు సుధాకర్, వెంకటేశ్‌నాయక్, సర్పంచ్‌లు రామాంజినేయులు, రామకృష్ణ పాల్గొన్నారు.

దళితులకు ఉపాధి పనులు కల్పించాలి

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో దళిత గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించి వలసలు నివారించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ తిరుపాలు కోరారు. డ్వామా పీడీ సలీంబాషాను శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కుళ్ళాయప్ప, లింగమయ్య, నరసింహులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఖాజీ కార్యాలయం ప్రారంభం

అనంతపురం కల్చరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఖాజీ కార్యాలయాన్ని శుక్రవారం స్థానిక లక్ష్మీనగర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా కర్ణాటకకు చెందిన దారుల్ ఉలూమ్ ఉపాధ్యాయుడు మౌలానా నజీర్ సాహెబ్, బాగేపల్లి దారుల్ ఉలూమ్ మదరసా ప్రిన్సిపాల్ మౌలానా నజీర్ సాహెబ్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మోద్దీన్, డీఎస్పీ మహబూబ్‌బాషాలతోపాటు ముస్లీం మతపెద్దలు హాజరై ప్రత్యేక దువా నిర్వహించి కార్యాలయాన్ని ప్రారంభించారు.

తెలుగు వెలుగు సత్కారం

అనంతపురం సెంట్రల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): గిడుగు రామ్మూర్తి జాతీయ పురస్కారం అందుకున్న డాక్టర్ దామోదర్ రెడ్డిని తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవా సంస్థ సత్కరించింది. శ్రీసాయి డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఏర్పాటుచేసిన సన్మాన సభలో సంస్థ ప్రతినిధులు రామకృష్ణారెడ్డి, రహీం ప్రసంగించారు. ఆధునిక బాషావిజ్ఞానాన్ని, తెలుగు సాహిత్యాన్ని భవిష్యత్ తరాలకు అందించేలా డాక్టర్ దామోదర్‌రెడ్డి కృషి హర్షణీయమని కొనియాడారు. కార్యక్రమంలో సాంబశివుడు, సుబ్బరాయుడు, ఈశ్వరయ్య పాల్గొన్నారు.



పునాదులకే పరిమితం..!

● ఆగిన జిల్లా దేవదాయశాఖ భవన నిర్మాణం
● పట్టించుకోని అధికారులు

రాప్తాడు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జిల్లా దేవదాయ, ధర్మాదాయ శాఖ కార్యాలయ భవన నిర్మాణ పనులు ప్రారంభ దశలోనే నిలిచిపోయాయి. భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాలేదు. పిల్లర్ల స్థాయిలో పనులు ఆగిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాప్తాడు సమీపంలోని ఆటో నగర్ వద్ద దేవదాయ శాఖ భూమిలో రూ. 50 లక్షలతో నూతన భవనాన్ని నిర్మించతలపెట్టారు. 2022 ఆగస్టు 24న నూతన భవన నిర్మాణానికి అప్పటి రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, జిల్లా దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ మేరకు కాంట్రాక్టర్ భవన నిర్మాణ పనులు మొదలుపెట్టారు. పిల్లర్లు, పునాది నిర్మించి ఆ తరువాత పనులు నిలిపివేశారు. ఆ తరువాత ఎలాంటి పనులు చేపట్టలేదు. దేవదాయ శాఖ భవన నిర్మాణాలకు దేవదాయశాఖ నిధులు ఉపయోగించరాదని ఒక వ్యక్తి కోర్టును ఆశ్రయించడంతో నిధులు మంజూరు నిలిపివేశారు. దీంతో కాంట్రాక్టర్ పనులను పిల్లర్ల దశకే వదిలేశారు. భవనం పిల్లర్ల దశకే నిలిచిపోవడంతో మందుబాబులకు నిలయంగా మారింది. రాత్రి సమయంలో మందుబాబులు మద్యం, ఇతర మాంసపు పదార్థాలు అక్కడికి తీసుకు వెళ్లి ఇష్టానుసారం చేస్తున్నారు. తాగేసిన ఖాళీ మద్యం సీసాలు కూడా అక్కడే వదిలేసి వెళుతుండటంతో ఆ ప్రదేశంలో మద్యం సీసాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అధికారులు స్పందించి ఆ భవనానికి ప్రభుత్వ నిధులు మంజూరు చేయించి పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



పునాదుల్లోనే నిలిచిపోయిన దేవదాయశాఖ భవన నిర్మాణ పనులు

కోర్టు ఆదేశాల మేరకే : రామాంజనేయులు, ఈఓ, దేవదాయశాఖ

కోర్టు ఆదేశాలతో దేవదాయశాఖ జిల్లా కార్యాలయానికి నిధులు నిలిపివేశారు. దీంతో భవన నిర్మాణ పనులు పిల్లర్ల దశకే నిలిచిపోయాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి నిర్ణయాలు తీసుకుంటాం.

వైసీపీ పాలనలో ఎన్ని రోడ్లు నిర్మించారో చెప్పాలి

● పరిటాల సునీత, శ్రీరామ్

రామగిరి/రాప్తాడు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎన్ని రోడ్లు నిర్మించారో చెప్పాలని ఆ పార్టీ నాయకుల విమర్శలపై ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం రామగిరి మండలంలోని ఎగువపల్లి నుంచి కొత్తగాదికుంట వరకు పీఆర్ కొట్టాల మీదుగా నాబార్డు రూ.3కోట్లతో నిర్మించే 5 కిలోమీటర్ల తారు రోడ్డుకు భూమిచేశారు. అదేవిధంగా పీఆర్ కొట్టాల గ్రామంలో రూ.29.50 లక్షలతో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన సీసీరోడ్డును ప్రారంభించారు. ఇంకా ఈ పనులకు అవసరమైన రూ.40లక్షల నిధులను సమకూర్చుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జగన్‌కు పరిపాలన చేత కాక రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచేసి పోతే సీఎం చంద్రబాబు వాటిన్నంటిని తీర్చుతూ అభివృద్ధివైపు అడుగులు వేస్తున్నారని అన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో రోడ్ల మరమతులు, నూతన రోడ్లు నిర్మిస్తుంటే వైసీపీ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎల్ నారాయణచౌదరి, రామ్మూర్తినాయుడు, రంగయ్య, పరంధామయాదవ్, గంగమ్మ, సుధాకర్, మారుతీప్రసాద్ పాల్గొన్నారు. రాప్తాడు మండలం హంపాపురం సమీపాన గల మౌనగిరి ఆంజనేయస్వామి దేవాలయం వద్ద సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. రూ. 20 లక్షలు ఎంపీ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు భూమి పూజ కార్యక్రమానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ దంపతులు, ఎమ్మెల్యే పరిటాల సునీత ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో మౌనగిరి వ్యవస్థాపకుడు ఈశ్వరయ్య, పంచాయితీరాజ్ డీఈ లక్ష్మీనారాయణ, ఏఈ కిషోర్‌కుమార్, నాయకులు కొండప్ప, శ్రీనివాసులు, తిరుపాలు, రవి, జాఫర్, రమణ పాల్గొన్నారు. అనంతరం రాప్తాడులోని అంగన్వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే పరిటాల సునీత తనిఖీ చేశారు. పాలు, గుడ్ల నాణ్యతను పరిశీలించారు.



హంపాపురం వద్ద సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

వాసవీమాత ధైర్యాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

వాసవీమాత ఆత్మార్పణ దినంలో ఎంపీ, ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

అనంతపురం కల్చరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల కులదైవం వాసవీ కన్యకాపరమేశ్వరిమాత త్యాగాన్ని, ధైర్యాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లాకేంద్రంలోని పాతూరు, కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయాల్లో వేడుకలను వైభవోపేతంగా నిర్వహించారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు ఆలయాల్లోనూ ఎమ్మెల్యే దగ్గుపాటి అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం కొత్తూరు అమ్మవారిశాలలో నూతన ఆర్ఓ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. తదనంతరం ఆలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... ఆర్యవైశ్యుల కులదైవం వాసవీ మాత తన భౌతిక దేహాన్ని విడిచి భగవంతునిలో ఐక్యమైన రోజునే వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ... వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. అందుకే ఇచ్చిన మాట ప్రకారం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ఈ ఏడాది వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించినట్లు తెలిపారు. పేద ఆర్యవైశ్యులకు సబ్సిడీ రుణాలందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖులు సిరిగుప్ప వెంకటేశ్వర్లు, మనోజ్, రమేష్ రాయల్, గోపామచ్చా నరసింహులు, మిట్టా ఆంజనేయులు, నాగభూషణ, కృష్ణం రఘు, రత్నమయ్య, రమేష్‌బాబు, నాగరత్నం, కృష్ణరంగయ్య, లక్ష్మీనరసింహులు, పీఎల్ఎన్ మూర్తి, బాబా, ఫిరోజ్ అహ్మద్, శీన, పవన్‌కుమార్ వందలాదిమంది ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.



కొత్తూరులో వాసవీమాత హోమ పూర్ణాహుతి నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, పూజల్లో ఎంపీ

ప్రైవేట్ విద్యాసంస్థల బంద్ విజయవంతం

అనంతపురం విద్య, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు శుక్రవారం నిర్వహించిన ప్రైవేట్ విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. కొన్ని స్కూళ్లు, కళాశాలలు ముందుగానే బంద్ చేయగా...మరి కొన్ని విద్యాసంస్థలను విద్యార్థి సంఘాల నేతలు దగ్గరుండి బంద్ చేయించారు. ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోకుంటే రాష్ట్ర స్థాయిలో ఉద్యమం చేస్తామని ఐక్య విద్యార్థి సంఘాల నేతలు హెచ్చరించారు. ఇటీవల ఇంటర్ విద్యార్థి మరణంపై నారాయణ విద్యాసంస్థలపై, ఆర్ఐఓ అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ విద్యార్థి సమాఖ్య, ఏఐఎస్‌బీ, తదితర సంఘాల నేతలు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీల బంద్ పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఉదయం ఖాజానగర్‌లోని నారాయణ కళాశాల వద్ద ధర్నా చేశారు. యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తర్వాత నాయకులు శారదానగర్‌లోని శ్రీసాయి, ఆర్డీఓ ఆఫీస్ వద్ద ఉన్న వికాస్ కాలేజ్, మాస్టర్ తదితర కళాశాలను బంద్ చేయించారు. అనంతరం సోముదలదొడ్డి వద్ద ఉన్న నారాయణ కళాశాల వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థి ఆత్మహత్యపై అధికారులు పెదవి విప్పకపోవడం దారుణం అన్నారు. కళాశాలపైనా, ఆర్ఐఓపై ఎందుకు చర్యలు తీసుకోలేదంటూ మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు కుళ్లాయిస్వామి, పరమేష్, నరేష్, సురేష్, చంద్రశేఖర్, వినోద్ కుమార్, వంశీ,చందు తదితరులు పాల్గొన్నారు.



కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలి



డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న డీఎస్సీ అభ్యర్థులు, డీవైఎఫ్ఐ నాయకులు

అనంతపురం కల్చరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం సందర్భంగా మెగా డీఎస్సీపై చేసిన తొలి సంతకం హామీ మేరకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో లలితకళా పరిషత్ నుంచి డీఈఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో మెగా డీఎస్సీ కోసం అనేక పోరాటాలు నిర్వహించామని తెలిపారు. మెగా డీఎస్సీ పోరాటం ఎన్నికల ముందు రాజకీయ అజెండాగా మారిందని గుర్తుచేశారు. తాము అధికారంలోకి వస్తే మొదటగా అమలు చేసేది మెగా డీఎస్సీనేనని చెప్పి అధికారంలోకి వచ్చాక కాలయాపన చేయడం అన్యాయమని విమర్శించారు. కనీసం విద్యాశాఖ మంత్రి అయినా డీఎస్సీ షెడ్యూల్ ఎప్పుడు ఇస్తారో చెప్పడం లేదన్నారు. వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ, నాయకులు నూరుల్లా, చరణ్, సురేంద్ర, ఇస్మాయిల్, వెంకటేష్, మసూద్, రమేష్, ముజీబ్ పాల్గొన్నారు.

ఏపీ, తమిళనాడు జట్లకు వరుస విజయాలు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ వెటరన్స్ క్రికెట్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు జట్లు వరుస విజయాలు నమోదు చేశాయి. శుక్రవారం ఆర్డీటీ స్టేడియంలో ఆర్‌వీవీకే మెమోరియల్ సౌత్‌జోన్ వెటరన్ క్రికెట్ పోటీలు రెండో రోజు కొనసాగాయి. మొదటి మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్, సర్వీసెస్ జట్లు తలపడగా...మొదట బ్యాటింగ్ చేసిన సర్వీసెస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 97 పరుగులు మాత్రమే చేసింది. అనంతరం బరిలోకి దిగిన ఏపీ జట్టు 13.4 ఓవర్లలో 5 వికెట్లు మాత్రమే కోల్పోయి 102 పరుగులు చేసి 5వికెట్ల తేడాతో విజయాన్ని నమోదు చేసింది. 34 పరుగులతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన భరత్‌కుమార్ మ్యాన్‌ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నారు. మరో మ్యాచ్‌లో తమిళనాడు, హైదరాబాద్ జట్లు తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి 162 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన హైదరాబాద్ జట్టు 18.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 164 పరుగులు చేసింది. 44 పరుగులు చేసిన విజయ్‌దళపతి జట్టును 4 వికెట్ల తేడాతో గెలిపించారు. ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ వెటరన్ క్రికెట్ క్రీడాకారుల క్రీడా ఆసక్తిని అభినందించారు. కార్యక్రమంలో బీవీసీఏ కార్యదర్శి సుధీర్ బాలచంద్రకులకర్ణి, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ జనరల్ మేనేజర్ ఎంఎస్ కుమార్, అపెక్స్ మెంబర్ ప్రసన్నకుమార్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఇన్‌చార్జి కార్యదర్శి భీమలింగారెడ్డి, ఏసీఏ సౌత్‌జోన్ మేనేజర్ సాగర్‌చౌదరి, జిల్లా వెటరన్ క్రికెట్ డైరెక్టర్ నాగప్ప, అధ్యక్షుడు కృష్ణమోహన్, సెక్రటరీ మధుకర్, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛోఫెర్రర్

రోడ్డు ప్రమాదాలతో కుటుంబాలు ఛిద్రం

ప్రజల ప్రాణాలు కాపాడటమే మన బాధ్యత: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోవడంవల్ల ఆ కుటుంబాలు ఛిద్రమైపోతున్నాయని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రోడ్డుప్రమాదాల నివారణ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల జీవితాలు చాలా విలువైనవని, వారి ప్రాణాలు కాపాడడం మనందరి బాధ్యత అని తెలిపారు. ఆర్డీటీ స్టేడియం వద్దగల వంతెనకు వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. అనంతపురం నగరంలో 206 సీసీ కెమెరాలు ఏర్పాటుకు సంబంధించి టెండర్లు పూర్తిచేయాలని అన్నారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఇలియాజ్‌బాష, డీఎస్పీ శ్రీనివాసరావు, డీటీసీ వీర్రాజు, ఆర్టీసీ ఆర్ఎం సుమంత్, డీఎంహెచ్ఓ డాక్టరు ఈ.బీదేవి, డీసీహెచ్ఎస్ డాక్టరు రవికుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు, నగరపాలక ఇంచార్జ్ కమీషనర్ మల్లికార్జునరెడ్డి ఆర్అండ్‌బీ ఈఈ, నేషనల్‌హైవే అధికారులు పాల్గొన్నారు.

ఉరుసు ఉత్సవాలను జయప్రదం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, వెంకటశివుడు యాదవ్

అనంతపురం కల్చరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పాతూరులోని మహల్దార్ వీధిలో మానుమాబీబీ దర్గా వద్ద ఈనెల 3, 4వ తేదీల్లో నిర్వహించనున్న ఉరుసు ఉత్సవాలను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, జామియా మసీదు ప్రతినిధులు, దర్గా కమిటీ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే ఉరుసు ఉత్సవాల పోస్టర్ల ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు జేఎం బాషా, గాజుల ఆదెన్న, ఇక్బాల్, ఇన్సాస్, శౌకత్ ఖాన్, ఖాజా, కరీముల్లా, మాబు, ఖాలేశా పాల్గొన్నారు.

శిల్పారామాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దండి

అనంతపురంరూరల్/అర్బన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని శిల్పారామాన్ని ప్రముఖ పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం తన క్యాంపుకార్యాలయంలో శిల్పారామం ఏఓ క్రిష్ణప్రసాద్‌తో ఆయన సమావేశం నిర్వహించారు. శిల్పారామంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితి, పర్యాటకులు, సౌకర్యాలపై చర్చించారు.

సొంతగూటికి జేఎం బాషా

గత ఎన్నికలకు ముందు టీడీపీ నుంచి వైసీపీలోకి వెళ్లిన మైనార్టీ నాయకుడు జేఎం బాషా తిరిగి సొంత గూటికి చేరారు. శుక్రవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ సమక్షంలో తిరిగి ఆయన పార్టీలో చేరారు.

మెదడులో కణతి తొలగింపు

అనంతపురం టౌన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): స్థానిక కిమ్స్ సవీరా ఆసుపత్రిలో అరుదైన ఆపరేషన్‌చేసి ఓ మహిళ ప్రాణాలు కాపాడారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం ఆసుపత్రి న్యూరోసర్జన్ డాక్టర్ మురళి, డాక్టర్ అనిల్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కడప జిల్లా పులివెందులకు చెందిన 58 ఏళ్ల ఆదినారాయణమ్మ మెదుడు ముందు భాగంలో 5 సెంటీ మీటర్ల కణతి ఉందని తెలిపారు. ఏడాదిగా తీవ్రంగా బాధపడుతుండగా ఆసుపత్రికి తీసుకొచ్చారని వివరించారు. పరీక్షలు నిర్వహించగా కణతి ఉన్నట్లు గుర్తించామన్నారు. దాదాపు 5గంటల పాటు శ్రమించి మెదుడులో ఉన్న కణతిని తొలగించామని తెలిపారు. ఇపుడు ఆమె ఆరోగ్యంగా ఉందని అన్నారు. అధునాతన వసతులు, పరికరాల వల్లనే ఇలాంటి ఆపరేషన్ చేయగలిగామని వెల్లడించారు.

విద్యార్థులను మోసం చేసిన వైసీపీ

అనంతపురం సెంట్రల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజుల మొత్తాలను బకాయిపెట్టి విద్యార్థులను వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందని టీఎన్ఎస్ఎఫ్ నాయకులు మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశంపై వైసీపీకి మాట్లాడే హక్కులేదని శుక్రవారం ఎస్కేయూలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు జగదీష్, కిరణ్ మండిపడ్డారు. ప్రభుత్వం నుంచి నేరుగా కళాశాలలకు చెల్లించే ఫీజురీయింబర్స్‌మెంట్‌కు మాజీ సీఎం జగన్‌రెడ్డి తన జేబులోనుంచి ఖర్చుచేసినట్లు గత ఐదేళ్ల ప్రజలను నమ్మించారన్నారు. జగన్ విద్యాదీవెన, జగన్ వసతి దీవెనల పథకాలుగా మార్చి ఉత్తిత్తి బటన్‌లు నొక్కారన్నారు. కూటమి ప్రభుత్వంలో విద్యార్థులకు సమస్యల్లేకుండా కళాశాలలకే ఫీజులు చెల్లిస్తుందని వివరించారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రిస్వామి, సరేంద్ర, తారక్, నరేష్, నరసింహ, తిరుపాల్ పాల్గొన్నారు.

గుమ్మనూరుపై చర్యలు తీసుకోవాలి

అనంతపురం సెంట్రల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మీడియా ప్రతినిధులను పట్టాలపై పడుకోబడెతానని బెదిరింపులకు పాల్పడ్డ గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎన్టీఆర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. తెలుగు దేశం పార్టీని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ప్రజల కోసం ఎన్టీఆర్ ఏర్పాటుచేశారన్నారు. అలాంటి పార్టీలో చేరిన గుమ్మనూరు ప్రజల సమక్షంలోనే విలేకరులను చంపుతానని బెదిరింపులకు పాల్పడటం దుర్మార్గమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందించి గుమ్మనూరుపై చర్యలు తీసుకుని విలేకరులకు క్షమాపణలు చెప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, రాజు, నారాయణస్వామి, మాధవ్, వెంకటేష్, సుధాకర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యకేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

రామగిరి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.కొత్తపల్లిలో శుక్రవారం ప్రభుత్వ ఆధ్వర్యంలో పశుఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ మౌలాలి బాష తెలిపారు. నట్టల నివారణ, వ్యాధి నిరోధక టీకాలు పశు పోషకుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో పశు వైద్యసిబ్బంది వందన, నాగార్జున, నరసింహులు, గోపాలమిత్ర ఆంజనేయులు పాల్గొన్నారు.

ర్యాపిడోను తరిమేయాలి: సీఐటీయూ

అనంతపురం కల్చరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల ఉపాధికి గండి కొడుతున్న ర్యాపిడోను అనంతపురం నుంచి తరిమేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆటో డ్రైవర్లతో కలిసి రుద్రంపేట బైపాస్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్రకుమార్ మాట్లాడుతూ.. ర్యాపిడోను తీసుకొచ్చి ఆటో డ్రైవర్ల ఉపాధిని నిర్వీర్యం చేయడానికి ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. నగరంలో దాదాపు 20వేల మంది ఆటో కార్మికులు ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని, ఈ రంగాన్ని కొత్త కొత్త నిబంధనల పేరుతో నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ఈనెల 3వ తేదీన కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహిస్తున్నామని, ఆటో డ్రైవర్లు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు రామిరెడ్డి, కార్యదర్శి మురుజా, నాయకులు సురేంద్ర, రామలింగారెడ్డి, గోపాల్, వలి, మసూద్, ప్రకాష్, వెంకటేష్, బుల్లిరాజు, లతీఫ్ పాల్గొన్నారు.



ర్యాలీలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్


CELEBRATING 25 YEARS OF VIJETHA
NOW OPEN IN ANANTAPUR
విజేత Fresh Healthy Living
TOMATO LOCAL PER KG Vijetha Price ₹14
CABBAGE PER KG Vijetha Price ₹26
KADDU (BOTTLE GOURD) PER KG Vijetha Price ₹38
ONION RED PER KG Vijetha Price ₹39
POTATO PER KG Vijetha Price ₹39
BENDI PER KG Vijetha Price ₹44
CARROT PER KG Vijetha Price ₹44
TOOR DAL LOOSE PER KG Vijetha Price ₹129
URAD ROUND LOOSE PER KG Vijetha Price ₹109
SUGAR LOOSE PER KG Vijetha Price ₹41
IDLY RAWA LOOSE PER KG Vijetha Price ₹39
PALLI LOOSE PER KG Vijetha Price ₹119
AADHAAR SUNFLOWE OIL 1LTR POUCH MRP ₹ 160 Vijetha Price ₹135 ONLY
FORTUNE SUNFLOWER OIL 1LT POUCH MRP ₹ 165 Vijetha Price ₹139 ONLY
TSF MILK BREAD 450G/ PAV BUN /CAKE 200G/ MUFFINS / DONUT 160G SELECTED RANGE) Vijetha Offer BUY 1 GET 1 FREE
VIJETHA WHOLE WHEAT ATTA 1KG / 5KG MRP ₹ 90/445 Vijetha Offer BUY 1 GET 1 FREE
DAAWATH HERITAGE BASMATHI RICE 1KG MRP ₹ 269 Vijetha Price ₹110 ONLY
COCO ROYAL BASIL SEED 290ML (ENTIRE RANGE) MRP ₹ 99 Vijetha Offer BUY 1 GET 1 FREE
B NATURAL JUICE 1LTR (ORANGE, MIXED FRUIT, APPLE, CRANBERRY) MRP ₹ 140 Vijetha Offer BUY 1 GET 1 FREE
SUNFEAST SWEET N SALT 342G MRP ₹ 80 Vijetha Offer BUY 1 GET 1 FREE
ORIGINAL KIMIA DATES 400G BOX Vijetha Offer BUY 1 GET 1 FREE
JERSEY DOODH PEDA 190G/ BADAM MILK 185ML PET MRP ₹ 40-199 Vijetha Offer BUY 1 GET 1 FREE
SUNFEAST MOMS MAGIC CASHEW & ALMOND COOKIES 94.5G MRP ₹ 35 Vijetha Offer BUY 1 GET 1 FREE
SUNFEAST DARK FANTASY CHOCO FILLS 600G MRP ₹ 350 Vijetha Offer BUY 1 GET 1 FREE
PARLE HIDE&SEEK CHOCOLATE 200G MRP ₹ 60 Vijetha Offer ₹30 OFF ON MRP
SUNFEAST DARK FANTASY CHOCO ROLLS 198G MRP ₹ 200 Vijetha Offer BUY 1 GET 1 FREE
BOOST REGULAR 750G POUCH / HORLICKS PLAIN 750G REFILL MRP ₹ 469/459 Vijetha Offer ₹100 OFF ON MRP
SAFFOLA HONEY PET JAR 1KG MRP ₹ 515 Vijetha Offer ₹185 OFF ON MRP
RED LABEL NATURAL TEA PWD 500G MRP ₹ 335 Vijetha Offer ₹20 OFF ON MRP
COLGATE STRONG TEETH 300G MRP ₹ 206 Vijetha Offer ₹20 OFF ON MRP
SENSODYNE TOOTH PASTE COMPLETE PROTECTION 70G MRP ₹ 205 Vijetha Offer ₹21 OFF ON MRP
PARACHUTE COCONUT OIL 600ML MRP ₹ 296 Vijetha Offer ₹75 OFF ON MRP
REXONA SOAP COCONUT& OLIVE 150G* 3PC SET MRP ₹ 267 Vijetha Offer ₹75 OFF ON MRP
MAMYPOKO PANTS DIAPERS (XL-40,L-48,M-58,S-68) Vijetha Offer ₹200 OFF ON MRP
MANGALDEEP AGARBATHI SANDLE 160 STICKS MRP ₹ 120 Vijetha Offer BUY 1 GET 1 FREE
SURF EXCEL MATIC LIQUID FRONT LOAD 4LTR POUCH MRP ₹ 885 Vijetha Offer ₹185 OFF ON MRP
DOVE BEAUTY BATHING BAR CREAM 125G*3PC SET MRP ₹ 249 Vijetha Offer ₹50 OFF ON MRP
SUNSILK SHAMPOO STUNNING BLACK SHINE 650ML MRP ₹ 809 Vijetha Offer BUY 1 GET 1 FREE
ODONIL ROOM SPRAY 240ML (CITRUS /JASMIN/ LAVENDER/SANDAL) MRP ₹ 169 Vijetha Offer BUY 1 GET 1 FREE
VIM DROP LIQUID LEMON 2LT POUCH MRP ₹ 405 Vijetha Offer ₹102 OFF ON MRP
VIM SOAP ANTI SMELL WITH PUDINA 200G*5PC SET MRP ₹ 130 Vijetha Offer ₹20 OFF ON MRP
CELLO FROSTY BUCKET 20LT MRP ₹ 372 Vijetha Offer ₹125 ONLY OFF ON MRP
OFFERS VALID ON 1st & 2nd FEBRUARY 2025 ONLY. VISIT OUR STORE FOR MANY MORE OFFERS
scan for location
Vijetha Supermarkets Pvt. Ltd.
Telangana • Andhra Pradesh
Maruthi Nagar 80 Feet Road Opp. Y.V. Shiva Reddy House,
Beside Mythrivanam Hotel, Anantapur, Andhra Pradesh - 515001
vijethasupermarkets VijethaSuperMarketsPvtLtd
SINCE 1999 In Customer Service

సంక్షిప్త వార్తలు

కందుల కొనుగోలు కేంద్రాల ప్రారంభం

శెట్టూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వ్యవసాయ గోడౌన్‌లో శుక్రవారం వ్యవసాయాధికారిణి వాసు కిరాణి మార్క్‌ఫెడ్ సహకారంతో, సీసీడీ సంస్థ ప్రతినిధులు హేమంత్, ఎర్రిస్వామి ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు విక్రయించే కందుల్లో తేమశాతం 12కు మించకుండా ఉండేలా చూసుకోవాలన్నారు. కందులు అనంతపురంలోని మార్క్‌ఫెడ్ గోడౌన్‌కు చేరిన వారం రోజుల తర్వాత రైతులకు ఖాతాల్లో సొమ్ము జమ చేస్తారని చెప్పారు. టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కణేకల్లు: మండల కేంద్రంలోని రైతుసేవాకేంద్రంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని రాయదుర్గం వ్యవసాయశాఖ ఏడీఏ లక్ష్మా నాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏవో శ్రావణ్‌కుమార్, టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, సుదర్శన్, బీటీ రమేష్, చంద్రశేఖర్‌గుప్తా, రైతులు పాల్గొన్నారు.

భూ రీసర్వే పనుల పరిశీలన



కరిగానపల్లిలో రీసర్వే రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ

కుందుర్పి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిగానపల్లిలో జరుగుతున్న భూరీ సర్వేను కళ్యాణదుర్గం ఆర్డీవో వసంతబాబు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వేకు వెళ్లే ముందు సంబంధిత రైతులకు తప్పకుండా సమాచారం ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. హాజరు కాని రైతులకు కనీసం మూడుసార్లు అవకాశం ఇవ్వాలని తెలిపారు. రీసర్వేకు అధికారులకు సహకరించాలని రైతులను కోరారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది, సర్వేయర్లు పాల్గొన్నారు.

భూ రీసర్వేపై సమీక్ష

కూడేరు: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సర్వే, సెటిల్మెంట్ ఏడీ రూప్లనాయక్ భూరీ సర్వేపై సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలోని జయపురంలో జరుగుతున్న భూ రీసర్వేను పక్కాగా చేపట్టాలని సూచించారు. అలాగే రెవెన్యూ సదస్సుల్లో రైతులు అర్జీల ద్వారా తెలిసిన సమస్యల్ని పరిష్కరించాలన్నారు. మండల రీ సర్వే డీటీ దబ్బర ప్రసాద్, సర్వేయర్ అయేషా సిద్దికి, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుత్తి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): గుత్తి ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కల్లుగీత కులస్థుల నుంచి మద్యం దుకాణాల నిర్వహణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ మోహన్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కల్లు గీత కులస్థులకు జనాభా నిష్పత్తి ప్రకారం గుత్తి మున్సిపాలిటీలో ఈడిగ కులానికి-1, రూరల్ పరిధిలో గౌడ కులానికి-1 చొప్పున మద్యం షాపులు కేటాయించారన్నారు. ఆసక్తికలగిన వారు ఈనెల 5వతేదీ సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ పద్దతుల్లో కూడా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. జిల్లాలోని పది ఎక్సైజ్ స్టేషన్ పరిధిలలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రూ.2లక్షలు నాన్ రిఫండ్‌బుల్ సొమ్ముతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫీజులో 50శాతం రాయితీ ఉంటుందన్నారు. దరఖాస్తుదారులు జిల్లా వాసులు అయి ఉండి, నేటివిటీ సర్టిఫికెట్‌తోపాటు సబ్ క్యాస్ట్ సర్టిఫికెట్‌తో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 7న కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో లాటరీ పద్దతిలో షాపు కేటాయిస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని సీఐ సూచించారు.

బాల్య వివాహాలపై అవగాహన

విడపనకల్లు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరకముక్కల జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో బాలికలకు శుక్రవారం ఆరోగ్యశాఖ విద్యా బోధకుడు వేణుగోపాల్ బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వల్ల బాలికలు మానసిక రుగ్మతలకు, అనారోగ్యాలకు గురవుతారన్నారు. ఎక్కడా కూడా బాల్యవివాహాలను ప్రోత్సహించరాదన్నారు. బాలికలను బాగా చదివించాలని సూచించారు. ఎవరైనా బాల్య వివాహాలు చేస్తే శిక్షకు అర్హులవుతారని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

కణేకల్లు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని సొల్లాపురం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం బహుమతులు, పుస్తకాలు ప్రదానం చేసినట్లు హెచ్‌ఎం చంద్రశేఖర్ తెలిపారు. తమ పాఠశాలలోని సైన్స్ టీచర్ సతీష్ తన తండ్రి నాగభూషణం జయంతి సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు, పుస్తకాలు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోగులకు బ్రెడ్లు, పాలు పంపిణీ

ఉరవకొండ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రజాగాయకుడు గద్దర్ జయంతిని పురస్కరించుకుని వజ్రకరూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు శుక్రవారం మాలమహానాడు నాయకులు బ్రెడ్లు, పాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సర్దార్ వలి, మాలమహానాడు నాయకుడు బాలరామాంజనేయులు, టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు రవీంద్ర పాల్గొన్నారు.

సెక్రటరీపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు

బెళుగుప్ప, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని యలగలవంక గ్రామంలో పింఛన్ల పంపిణీ విషయంపై అంగన్‌వాడీ కార్యకర్తలను అగౌరవపరుస్తూ బెదిరిస్తున్న గ్రామ సెక్రటరీ శంకరయ్యపై చర్యలు తీసుకోవాలంటూ అంగన్‌వాడీల సంఘం జిల్లా అధ్యక్షురాలు శకుంతల శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదేశించలేదని, కేవలం లబ్ధిదారులను గుర్తించడానికి సహకారం అందించాలని కోరిందని తెలిపారు. ఈ సెక్రటరీ నగదు కూడా మీరే పంపిణీ చేయాలని చెబుతున్నారని, లేకుంటే మీకథ చూస్తానంటూ బెదిరిస్తున్నారని వాపోయారు. చిన్న ఉద్యోగులం నగదు మా వద్ద ఉంచుకోలేమంటూ తెలిపినా పట్టించుకోకుండా బెదిరింపు ధోరణితో మాట్లాడుతూ అగౌరవపరుస్తున్నారని అన్నారు. ఆ సెక్రెటరీపై చర్యలు తీసుకోవాలని హెచ్‌సీ బాలనరసింహులుకు ఫిర్యాదు చేశారు. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళతా మని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పైపులైన్ పనులు త్వరగా పూర్తి చేస్తాం

● రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

● ఉదిరిపికొండ, ఉరవకొండ తాగునీటి పథకం పైపులైన్ పనుల పరిశీలన



పైపులైన్ పనులను పరిశీలిస్తున్న మంత్రి కేశవ్

ఉరవకొండ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఉదిరిపికొండ, ఉరవకొండ తాగునీటి పథకం పైపులైన్ పనులను మూడు నెలల్లోపు పూర్తి చేసి వేసవిలో తాగునీటి ఎద్దడి కలగకుండా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. మండలంలోని చిన్నముష్టూరు సమీపంలో జలజీవన్ మిషన్ కింద రూ.21 కోట్ల వ్యయంతో చేపడతు న్న తాగునీటి పథకం పైపులైన్ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే నీటి సరఫరా మెరుగునకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. తాగునీటి పైపులైన్ పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తామని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం తాగునీటి వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. ఫిల్టర్ బెడ్ల మరమ్మతులను కూడా చేసిన దాఖాలాలు లేవన్నారు. ఇప్పుడు ఒక్కరోజులో మెరుగుపరచడానికి సాధ్యం కాదని, ప్రత్యామ్నాయంగా తాగునీటి నాణ్యతను మెరుగు పరిచేందుకు మైక్రో ఫిల్టర్ బెడ్లకు ఎంపీ నిధులు వెచ్చిస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు తాగు నీటిని సరఫరా చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సప్రీన్, ఏఈ ఐజయ్య, సైట్‌ఇంజనీర్ దాక్షాయణి, టీడీపీ నాయకుడు ప్యారంకేశవానంద పాల్గొన్నారు.

మంత్రి ప్రజాదర్బార్..

ఉరవకొండ పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంత్రి కేశవ్ ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మంత్రిని కలిసి సమస్యలను విన్నవించారు. ఏపీవిద్యుత్ మీటర్ రీడర్స్ నాయకులు మంత్రిని కలిసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అలాగే ఎంపీఈవోలు వచ్చి రాష్ట్ర వ్యాప్తంగా 1386మంది ఎంపీఈవోలు చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్నామని, వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలని విన్నవించారు. ఉరవకొండ పంచాయతీ క్వార్టర్స్‌లో కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయాలని, వార్డు సభ్యులు వినతి పత్రాన్ని అందజేశారు.

ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల బంద్ విజయవంతం



రాయదుర్గంలో విద్యార్థి నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

గుంతకల్లు టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి సంఘాల నాయకులు శుక్రవారం చేపట్టిన ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల బంద్ పట్టణంలో విజయవంతమైంది. విద్యాసంస్థల యాజమాన్యాలు స్వచ్ఛందంగా సెలవులు ప్రకటించాయి. ఈ సందర్భంగా విద్యార్థిసంఘాల నాయకులు మాట్లాడుతూ అనంతపురం నగరంలోని నారాయణ జూనియర్ కాలేజీలో వారం క్రితం ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటే ఇంతవరకు ఆ విద్యాసంస్థల యాజమాన్యంపై కేసులు నమోదు చేయలేదన్నారు. ఇది ఎంతో శోచనీయమన్నారు. ఇప్పటికైనా ఆ విద్యాసంస్థల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి వంశీ యాదవ్, నియోజకవర్గ అధ్యక్షుడు నారప్ప, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు అఖిల్, శివమణి, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సాయి డిగ్రీ కళాశాల వద్ద నిరసన తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ మాట్లాడుతూ.. ఇప్పటికైనా అధికారులు స్పందించి నారాయణ కళాశాల యాజమాన్యంపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు జిలాన్, శేఖర్, నవీన్, హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌నాయక్ పాల్గొన్నారు

రాయదుర్గంరూరల్: పట్టణంలోని వినాయక సర్కిల్ వద్ద ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు నిరసన చేపట్టారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ మాట్లాడుతూ నారాయణ కాలేజీలో విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటే ఆ యాజమాన్యంపై కేసులు నమోదు చేయకపోవడం వెనుక ఆంతర్యమేమిటోనని ప్రశ్నించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు గానీ, రాష్ట్ర ప్రభుత్వం గానీ స్పందించకపోతే త్వరలో ఛలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. నిరసన చేపడుతున్న విద్యార్థి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వంశీ, వలి, దేవరాజ్, అనిల్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాత విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

తాడిపత్రి, జనవరి 31(ఆంధ్రజ్యోతి) ఇక పట్టణం సమీపంలోని ఐశ్వర్యవిల్లాస్ సర్కిల్‌లో వాసవీమాత విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ జరిగింది. ముఖ్యఅతిథిగా జేసీ ప్రభాకర్‌రెడ్డి హాజరై భూమిపూజ చేశారు. అంతకుముందు పట్టణంలోని అమ్మవారిశాల నుంచి ఆర్యవైశ్యులు పెద్దఎత్తున బైక్ ర్యాలీ ద్వారా ఐశ్వర్యవిల్లాస్ వద్దకు చేరుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

90 లీటర్ల నాటుసారా స్వాధీనం

గుంతకల్లుటౌన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి):మండలంలోని కసాపురం గ్రామ శివారులో గల నంచర్ల క్రాస్ వద్ద శుక్రవారం ఆటోలో తరలుతున్న 90లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ శివసాగర్ తెలిపారు. కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన హరిజనతరుణ్ అనే వ్యక్తి ఆటోలో నాటుసారా తరలిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. దీంతో వెంటనే దాడులు నిర్వహించి 90లీటర్ల నాటుసారాను, ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు. అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. దాడుల్లో సీఐ సుహాసిని, ఎస్ఐలు సుశీలమ్మ, వెంకటేశం, సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీ నిర్మాణానికి స్థలం వితరణ

కుందుర్పి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనుములదొడ్డి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి ఎకరా స్థలాన్ని అదే గ్రామానికి చెందిన లక్ష్మీకాంత్ వితరణ చేశారు. స్థానిక టీడీపీ నాయకులు, గ్రామస్థులతో శుక్రవారం ఆయన కలిసి తహసీల్దార్ శ్రీనివాసులుకు భూమి హక్కు పత్రాలను అందజేశారు. గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు కావడంతో స్థలం కొరతగా వుండటం వల్ల భవన నిర్మాణం చేపట్టలేదు. దీంతో లక్ష్మీకాంత్ ముందుకు వచ్చి ఎకరా స్థలాన్ని వితరణ చేయడంతో గ్రామస్థులు అభినందించారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

శెట్టూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మాఘ మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని లక్ష్మంపల్లిలో గల పురాతన శివాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజల్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే అర్చకులు మూలవిరాట్‌కు పలు అభిషేకాలు, అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ప్రతి యేటా ఏప్రిల్ మాసంలో సూర్యోదయ సమయంలో సూర్యకిరణాలు శివలింగంపై పడటం ఇక్కడి ప్రత్యేకత.

హక్కులు, చట్టాలపై అవగాహన

బెళుగుప్ప/ బ్రహ్మసముద్రం: జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా మండలంలోని శీర్పి ఎస్సీ కాలనీలో ప్రజలకు శుక్రవారం హక్కులు, చట్టాలపై తహసీల్దార్ షర్మిల, ఎస్ఐ శివ అవగాహన కల్పించారు. వీఆర్వో ఈశ్వరరెడ్డి, సెక్రటరీ రవి పాల్గొన్నారు. అలాగే బ్రహ్మసముద్రం మండలం వేపులపర్తి ఎస్సీ కాలనీలో ప్రజలకు తహసీల్దార్ సుమతి, సర్పంచ్ రంగప్ప, ఎంపీడీవో నందకిషోర్ అవగాహన కల్పించారు.

రేపు కంటి వైద్యశిబిరాలు

తాడిపత్రి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పుట్లూరు, యల్లనూరు మండలకేంద్రాల్లోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 2వ తేదీన ఉచిత కంటి వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు క్లబ్ గవర్నర్ రమేష్‌నాథ్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కర్నూలు శాంతిరాం హాస్పిటల్ వైద్యులు శిబిరంలో పాల్గొని పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఆయా మండలాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వీరారెడ్డిపల్లిలో స్ప్రింక్లర్ పైపులు చోరీ

యాడికి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరారెడ్డిపల్లిలో గురువారం రాత్రి నాగార్జునరెడ్డి అనే రైతుకు చెందిన పొలంలో 27 స్ప్రింకర్లపైపులు చోరీకి గురయ్యాయి. రెండురోజులక్రితం నీటిపారకం పూర్తికావడంతో పైపులన్నింటినీ తోటలో ఒకచోట నిల్వచేశానని, శుక్రవారం ఉదయం తోటవద్దకు వెళ్లి చూడగా పైపులు లేవని బాధితుడు తెలిపాడు. గుర్తుతెలియని వ్యక్తులే పైపులను ఎత్తుకెళ్లారని అన్నారు. ఒక్కొక్క స్ప్రింకర్ పైపు విలువ రూ.900 ఉంటుందన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

చౌడేశ్వరి ఆలయంలో ఆభరణాల అపహరణ

పెద్దపప్పూరు: మండలంలోని చింతలపల్లిలో గల చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో సుమారు రూ.10వేలు విలువగల అమ్మవారి వెండి ఆభరణాలను శుక్రవారం దుండగులు ఎత్తుకెళ్లారు. అమ్మవారి కిరీటం, కమ్మలు, గొడుగు చోరీ అయినట్లు గ్రామస్తులు తెలిపారు. ఎస్ఐ నాగేంద్రప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

గోకులం షెడ్డు ప్రారంభం

పెద్దవడుగూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టిపాడు గ్రామంలో గోకులం షెడ్డును టీడీపీ మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేస్తోందని అన్నారు. గోకులం షెడ్లను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపాధిహామీ ఏపీఓ పుల్లారెడ్డి, టీడీపీ మండల నాయకులు నారాయణస్వామి, షెక్షావలి, భోగేశ్వరనాయుడు, పంచాయతీ సెక్రెటరీ షెక్షావలి పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌కు తరలిరండి

శెట్టూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హైదరాబాద్ నడిబొడ్డున ఫిబ్రవరి 7వ తేదీన తలపెట్టిన వేల గొంతుకలు, లక్షల డప్పులు మహాప్రదర్శనకు అన్ని ప్రజా సంఘా ల నాయకులు, మాదిగలు పెద్దఎత్తున తరలివెళ్లాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు టైగర్ వన్నూరుస్వామి శుక్రవారం ప్రకటనలో పిలుపునిచ్చారు. సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూల తీర్పు ఇచ్చిందన్నారు. ఆ తీర్పును అమలు పరచడంలో ఆ యా రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. అందుకు నిరసనగా వేలాదిగా డప్పులతో హైదరాబాద్ నడిబొడ్డున మహాప్రదర్శన చేపట్టినట్లు చెప్పారు. విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

తాడిపత్రి: ఈనెల 7వ తేదీన జరిగే హలో మాదిగ.. చలో హైదరాబాద్ కార్యక్రమానికి పెద్దఎత్తున తరలిరావాలని ఎమ్మార్పీఎస్ మొదటి తరం ఉద్యమనాయకుడు గంగరాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన చింతల వెంకటరమణస్వామి ఆలయ ఆవరణలో మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో లక్ష డప్పులతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నారన్నారు. మాదిగలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. నాయకులు ఈశ్వరయ్య, పుల్లయ్య, శివుడు, శంకర్, రాజారత్నం, లక్ష్మీనారాయణ, వాసు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు కేటాయించాలని వినతి

కూడేరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దలాపురం గ్రామ దళితవాడలో ఇంటి స్థలాలు లేని నిరుపేదలకు వెంటనే స్థలాలు కేటాయించాలని ఇన్‌చార్జి తహసీల్దార్ మహబూబ్ బాషాకు టీడీపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. మండలకేంద్రంలో శుక్రవారం వారు ఇన్‌చార్జి తహసీల్దార్‌ను కలిసి మాట్లాడారు. దళితవాడలో దాదాపు 77మంది ఇంటి స్థలాలు, ఇళ్లులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనుక వాటిని కేటాయించాలని కోరారు. ఇంటి స్థలాలకు కావాల్సిన భూమిని సేకరించి సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దారు తెలిపినట్లు నాయకులు నారాయణస్వామి, కిష్టప్ప, పెన్నోబులేసు, సంగప్ప, అశోక్, ప్రసాద్ పేర్కొన్నారు.

వాసవీమాతా.. నమోస్తుతే..

● భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఆత్మార్పణ దినం

● ఆలయాల్లో ప్రత్యేక పూజలు

● పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యేలు



రాయదుర్గంలో ప్రత్యేక అలంకరణలో కన్యకాపరమేశ్వరి



గుంతకల్లులో వాసవీ అమ్మవారికి పట్టు వస్త్రాలను తీసుకెళ్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



తాడిపత్రిలో పట్టువస్త్రాలు సమర్పిస్తున్న జేసీపీఆర్ దంపతులు



కళ్యాణదుర్గంలో అమ్మవారిని దర్శిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా గుంతకల్లు పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయమే అర్చకు లు అమ్మవారి మూలవిరాట్‌ను అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు, యాగాలు, కలశ పూజ, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వం తరపున ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం దంపతులు పట్టువస్త్రాలను సమర్పించి అర్చనలు చేయించారు. సాయం త్రం 7గంటలకు ఆర్యవైశ్య మహిళలు వాసవీ సహస్రనామ పారాయణం, రాత్రి 8 గంటలకు ప్రాకారోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే తాడిపత్రి పట్టణంలోని కన్యకాపరమేశ్వరి అల యంలో పుష్పయాగం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రభుత్వం తరపున మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆయన సతీమణి జేసీ ఉమారెడ్డి పట్టువస్త్రాలు సమర్పించి కుంకుమార్చన చేయించారు. కళ్యాణదుర్గం పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చాక వాసవీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తుండటం సంతోషంగా ఉందన్నారు.

ఇక గుత్తి పట్టణంతో పాటు ఆర్‌ఎస్‌లో, బెళుగుప్ప మండల కేంద్రంలో, యాడికి మండలకేంద్రంలో, రాయదుర్గం పట్టణంలోని వాసవీ అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

● ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయరాం

గుంతకల్లు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, ప్రస్తుతం ఆర్థిక పరిస్థితి ఏమీ బాగలేకున్నా.. అభివృద్ధిని, సంక్షేమాన్ని ఆయన ముందుకు నడిపిస్తున్నారని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ఐదేళ్ల కాలంలో అప్పటి సీఎం జగన్ రూ.పది లక్షల కోట్ల అప్పులు చేశారని, ప్రతి సంవత్సరమూ అసలు, వడ్డీ కలిపి రూ.71 వేల కోట్లు చెల్లించాల్సిన దుస్థితి రాష్ట్రానికి దాపురించేలా చేశారని దుయ్యబట్టారు. జగన్ హయాంలో అభివృద్ధి అడుగంటిపోయిందన్నారు. సంక్షేమ పథకాలన్నీ అప్పులతోనే నడిచాయన్నారు. చంద్రబాబు అధికారం చేపట్టాక సూపర్ సిక్స్ పథకాలలో మూడింటిని ప్రారంభించి, అభివృద్ధి కార్యక్రమాలు కూడా చేపడుతున్నారని తెలిపారు. పరిశ్రమలకు పెట్టుబడులు తెచ్చి, ఉద్యోగావకాశాలు పెంచడానికి శ్రమిస్తున్నారన్నారు. మరోవైపు రాజధాని నిర్మాణానికి కృషి చేస్తున్నారన్నారు. తాను చంద్రబాబు సహకారంతో గుంతకల్లు నియోజకవర్గానికి రూ.కోటికి పైచిలుకు సీఎంఆర్‌ఎఫ్ ఆర్థిక సాయాన్ని తెచ్చి ఆపన్నులకు అందజేశానని తెలిపారు. ఆర్థిక పరిస్థితి బాగలేనప్పటికీ అభివృద్ధికి కృషి చేస్తున్న చంద్రబాబుకు ప్రజలందరూ మద్దతుగా నిలవాలని కోరారు. సమావేశంలో నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, పత్తి హిమబిందు, తలారి మస్తానప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు బస్సు సర్వీసు ప్రారంభం

బ్రహ్మసముద్రం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దలాపురం గ్రామానికి ఎన్నో ఏళ్లుగా బస్సు సౌకర్యం లేదు. దీంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ముఖ్యంగా ఇతర ప్రాంతాల్లో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థుల పరిస్థితి దారుణంగా ఉండేది. సమస్యను ఇటీవల గ్రామస్థులు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన ఆయన గ్రామానికి బస్సు సర్వీసు నడిపేందుకు ఆర్టీసీ అధికారులను ఒప్పించారు. దీంతో శనివారం ఎమ్మెల్యే చేతుల మీదుగా ముద్దలాపురానికి బస్సు సర్వీసు ప్రారంభం కానుందని టీడీపీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు శుక్రవారం తెలిపారు. అలాగే పింఛన్ల పంపిణీ కూడా ఎమ్మెల్యే చేతుల మీదుగా జరుగుతుందని చెప్పారు.

ఎస్ వెంకటంపల్లికి బస్సు ట్రయల్ రన్

కుందుర్పి: మండలంలోని ఎస్ వెంకటంపలి గ్రామస్థులు గత సోమవారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తమ గ్రామానికి ఆర్టీసీ బస్సు వచ్చేలా చూడాలని తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఇందుకు తహసీల్దార్ రవాణా శాఖ అధికారులకు సమస్యను చేరవేశారు. స్పందించిన ఆ అధికారులు శుక్రవారం కళ్యాణదుర్గం నుంచి ఎస్ వెంకటంపల్లికి ట్రయల్ రన్‌గా ఆర్టీసీ బస్సును నడిపారు. త్వరలో గ్రామానికి బస్సు వచ్చేలా చూస్తామని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

రిటైర్డ్ సీనియర్ అసిస్టెంట్‌కు సన్మానం



వాసుదేవరావు దంపతులను సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

యల్లనూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వాసుదేవరావు రిటైర్డ్ అవడంతో శుక్రవారం కార్యాలయ సిబ్బంది సన్మానం చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోనే ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ రాజాతో పాటు పుట్లూరు, గుంతకల్లు తహసీల్దార్లు శేషారెడ్డి, రమాదేవి హాజరై వాసుదేవరావు దంపతులకు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. వీఆర్వోలు, మండల సర్వేయర్లు, స్టోర్ డీలర్లు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోండి

రాయదుర్గంటౌన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని నిరుద్యోగులు బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పురపాలక సంఘం పరిధిలో బీసీలకు 48, ఈబీసీకి 4, కమ్మకు రెండు, రెడ్డికి ఒకటి, ఆర్యవైశ్యలకు రెండు, బ్రాహ్మణులకు ఒకటి, కాపులకు ఎనిమిది, జనరిక్ మెడికల్ షాప్‌లకు 3 చొప్పున యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. జనరిక్ మెడికల్‌షాపులకు దరఖాస్తు చేసుకోవడానికి బీ ఫార్మసీ పూర్తి చేసి ఉండాలన్నారు. ఈనెల 7 వరకు స్థానిక వార్డు సచివాలయాలలో డిజిటల్ అసిస్టెంట్ల ద్వారా సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాయదుర్గం మండలంలోని నిరుద్యోగ యువతకూడా బీసీ రుణాల కోసం ఫిబ్రవరి 7 లోగా సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

కూడేరు: ప్రభుత్వం మంజూరు చేసిన బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి సూచించారు. బీసీ కార్పొరేషన్ కింద మండలానికి 42 యూనిట్లు విడుదల చేశారన్నారు. వివిధ బ్యాంకుల కింద రుణాలు పొందడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వచ్చేనెల 7వ తేదీ వరకు అవకాశం ఉందని అన్నారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

7 యూనిట్లు మంజూరు

యల్లనూరు: మండలంలో బీసీ కార్పొరేషన్ ద్వారా 7యూనిట్లు మంజూరైనట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ వాసుదేవరెడ్డి తెలిపారు. అర్హులు యల్లనూరు, తిమ్మంపల్లి, వెన్నపూసపల్లి బ్యాంకుల పరిధిలో వీటికి దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఫిబ్రవరి 7లోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

మట్టి తరలింపు వివాదాస్పదం

పుట్లూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాలవేముల గ్రామ శివారులో కొందరు వ్యక్తులు కొండమట్టిని అక్రమంగా తరలిస్తుండడం వివాదాస్పదమైంది. ఈ మేరకు సీఐ సత్యబాబు శుక్రవారం సంఘటనా స్థలానికి చేరుకుని మట్టి తరలింపు నిలిపివేసినట్లు తెలిసింది. ఇప్పటికే ఆ గ్రామశివారులో గత నెలరోజుల నుంచి అధికారులకు తెలియకుండా గుట్టుగా మట్టిని తరలిస్తున్నట్లు తెలిసి కొందరు వ్యక్తులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో గ్రామంలో శాంతి భద్రతల సమస్య వస్తుందని గ్రహించిన పోలీసులు టిప్పర్లను నిలిపివేసి పంపినట్లు సమాచారం.

నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయాలి: సీపీఐ

రాయదుర్గంరూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పట్టణం, రూరల్ ప్రాంతాలలో అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ కోరారు. పట్టణంలోని మొలకాల్మూరురోడ్డు, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన ఇల్లు లేని నిరుపేదలతో సమావేశమై మాట్లాడారు. ఇల్లు లేని వారు అర్జీలు ఇవ్వాలని, దీనిపై సచివాలయాల ఎదుట సోమవారం నిర్వహించే ధర్నాకు హాజరు కావాలని తెలిపారు. నిరుపేదలకు పట్టణాలలో రెండు సెంట్లు, గ్రామాలలో మూడుసెంట్లు స్థలాన్ని కేటాయించి రూ.5 లక్షల వ్యయంతో ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ తాలూకా కార్యదర్శి నాగార్జున, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్రేష్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

డి.హీరేహాళ్ మండలం సోమలాపురం గ్రామ సమీపంలో ఉన్న రైల్వే యార్డులో విద్యుత్ వైర్లకు టిప్పర్ తగిలి దగ్ధమైన ప్రమాదంలో మృతి చెందిన డ్రైవర్ మహమ్మద్ సైఫుల్లాకుటుంబాన్ని ఆదుకోవాలని జాఫర్ కోరారు. రాయదుర్గం ప్రభుత్వాసుపత్రిలో మృతదేహాన్ని ఆయన సందర్శించి నివాళులర్పించారు. మైన్స్ యాజమాన్యం మృతుని కుటుంబానికి కోటి రూపాయలు అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.